నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 24-10-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 ▪ Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:60 పేజీలు:6 వెల: రూ.1/-

నేటి కందం- నేటికి అందం

కబడీలో మన దేశము
ప్రబలమ్మగు శత్రువైన పాకిస్థానున్
విబుధులు మెచ్చంగ గెలిచి
దబదబ మ్రోగించె విజయ ధంకాను మొగిన్ !!

(ఏషియన్ యూత్ గేమ్స్ లో మన దేశం ఫైనల్ హా పాకిస్థాను ను జయించి విజయ ధంకా మ్రోగించింది. పాకిస్థాను అమానవీయతకు వ్యతిరేకంగా వారితో చేతులు కలపడానికి కూడా నిరాకరించి దేశభక్తిని చాటింది.)

-రాధశ్రీ
సెల్:9494481210

నేటి మాట

సాంకేతిక సామ్రాజ్యం
సర్వస్వం ఏలుతుంది
రహస్యాల దుర్భేద్యపు
రక్షణను కూల్చుతుంది.
మనిషి చలన గుట్టును
మరుక్షణం విప్పుతుంది
జాగ్రత్తగా మసలకుంటే
జీవితాల్ని ముంచుతుంది

-వేల్పుల నారాయణ
9440433475

తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయం.. ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తివేత..

హైదరాబాద్, అక్టోబర్ 23:1994లో అప్పటి ప్రభుత్వం కుటుంబ నియంత్రణపై అవగాహన కల్పించడానికి ఇద్దరు పిల్లల నిబంధనను అమల్లోకి తెచ్చింది. 1994 తర్వాత మూడో సంతానం కలిగిన వారు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి అనర్హులుగా మారారు.

తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఉన్న 'ఇద్దరు పిల్లల నిబంధన' ఎత్తివేతకు కేబినెట్ ఆమోదం తెలిపింది. పంచాయతీరాజ్ చట్టం 2018లోని సెక్షన్ 21(3) తొలగించాలని కేబినెట్ నిర్ణయించింది. ఇప్పటికే పంచాయతీ రాజ్ చట్టం 2018లోని సెక్షన్ 21(3)ని సవరించే ఆర్డినెన్స్‌పై ఆ శాఖ మంత్రి సీతక్క, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతకం చేశారు.

కేబినెట్ ఆమోదం పొందిన నేపథ్యంలో ఆర్డినెన్స్ బిల్లు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దగ్గరకు వెళ్లనుంది. గవర్నర్ ఈ బిల్లును ఆమోదిస్తే వచ్చే గ్రామీణ స్థానిక ఎన్నికల్లో ఇద్దరికి మించి పిల్లలు ఉన్నవారు కూడా పోటీ చేసేందుకు వీలు కలుగుతుంది. కాగా, 1994లో అప్పటి ప్రభుత్వం కుటుంబ నియంత్రణపై అవగాహన కల్పించడానికి ఇద్దరు పిల్లల నిబంధనను అమల్లోకి తెచ్చింది. 1994 తర్వాత మూడో సంతానం కలిగిన వారు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి అనర్హులుగా మారారు.

తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం

హైదరాబాద్, అక్టోబర్ 23:తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రిజిస్ట్రేషన్ శాఖ లో కొత్తగా 14 మంది సబ్ రిజిస్ట్రార్లని రేవంత్‌రెడ్డి సర్కార్ నియమించింది. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇందుకు సంబంధించిన విషయాలను మీడియాకు వెల్లడించారు. స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖలో కొత్తగా నియమించిన అధికారులు బాధ్యతలు స్వీకరించారని తెలిపారు.

కాంగ్రెస్ హయాంలోనే యువతకు ఉద్యోగాలు: మంత్రి పొంగులేటి

కాంగ్రెస్ హయాంలోనే యువతకు ఉద్యోగాలు వచ్చాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఉద్ఘాటించారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని ప్రకటించారు. జీపీవోలు, ఇంజినీర్లు, సర్వేయర్ల నియమకాలతో ఉపాధి అవకాశాలని తమ ప్రభుత్వం విస్తరించిందని తెలిపారు. రిజిస్ట్రేషన్ శాఖలో కొత్తగా 14 మంది సబ్ రిజిస్ట్రార్లని నియమించామని వెల్లడించారు. కేసీఆర్ ప్రభుత్వంలో నిరుద్యోగుల కలలు కల్లలు అయిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ప్రభుత్వంలో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చుతున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

శ్రీ నారాయణ గురు మహాసమాధి శతాబ్ది కార్యక్రమాన్ని ప్రారంభించిన రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపదీ ముర్ము

న్యూఢిల్లీ, అక్టోబర్ 23:శ్రీ నారాయణ గురు మహాసమాధి శతాబ్ది కార్యక్రమాన్ని రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపదీ ముర్ము కేరళలోని వర్కలాలో గల శివగిరి మఠంలో ఈ రోజు ప్రారంభించారు.

ఈ సందర్భంగా రాష్ట్రపతి ప్రసంగిస్తూ.. శ్రీ నారాయణ గురు భారతదేశంలో మహనీయ ఆధ్యాత్మిక ప్రముఖుల్లో, సంఘ సంస్కర్తల్లో ఒకరని అన్నారు. ఆయన మన దేశ సాంఘిక, ఆధ్యాత్మిక రంగాల్లో ప్రభావాన్ని చూపిన ఓ సాధువు, దార్శనికుడు అని కూడా రాష్ట్రపతి అన్నారు. సమానత్వం, ఏకత, మానవాళి పట్ల ప్రేమ.. ఈ ఆదర్శాలపైన విశ్వాసాన్ని పెంచుకోవాల్సిందిగా కొన్ని తరాలకు స్ఫూర్తిని ఆయన అందించారని శ్రీమతి ముర్ము అన్నారు.

అజ్ఞానం, అంధవిశ్వాసాల బారి నుంచి ప్రజలను రక్షించడానికి తన జీవితాన్ని అంకితం చేశారనీ, 19వ శతాబ్దంలో వచ్చిన సాంస్కృతిక పునరుజ్జీవన సమయంలో ఆయన కీలక పాత్రను పోషించారనీ రాష్ట్రపతి అన్నారు. అస్తిత్వ రహస్యం- ఏకత్వమేనని, ప్రతి ప్రాణిలో ఉండేది దివ్యత్వ సారమే దైవమని గమనించి, "మానవ జాతికంతా ఒకే కులం, ఒకే మతం, ఒకే దైవం" అంటూ ఓ శక్తిమంతమైన సందేశాన్నిచ్చారని రాష్ట్రపతి వివరించారు. శ్రీ నారాయణ గురు బోధనలు కులాలు,మతాలు, వర్గాల పరిధికన్నా మించినవని రాష్ట్రపతి వ్యాఖ్యానించారు. సిసలైన విముక్తి అంటే అది జ్ఞానం నుంచీ, కారుణ్యం నుంచీ లభించేదే తప్ప అంధ విశ్వాసం ద్వారా దక్కేది కాదని ఆయన విశ్వసించినట్లు శ్రీమతి ముర్ము అన్నారు. సచ్ఛీలత, నిరాడంబరత, విశ్వవ్యాప్త ప్రేమ భావనల గురించి శ్రీ నారాయణ గురు తరచూ ప్రధానంగా చాటి చెప్పారని రాష్ట్రపతి అన్నారు.

శ్రీ నారాయణ గురు ఏర్పాటు చేసిన ఆలయాలు, పాఠశాలలు, సామాజిక సంస్థలు విద్యనూ, స్వయంసమృద్ధి సాధననూ, అణచివేతకు గురైన వర్గాలకు నైతిక విలువలనూ ప్రబోధించాయని రాష్ట్రపతి అన్నారు. సంస్కృత, మలయాళ, తమిళ భాషల్లో శ్రీ నారాయణ గురు రచనలు లోతైన తాత్త్విక చింతనను నిరాడంబరతతో కలబోశాయన్నారు. మానవ జీవనం అన్నా, ఆధ్యాత్మికత అన్నా ఆయనకు ఎంత విస్తృత అవగాహన ఉందో ఆయన రచనలే మనకు చెబుతాయని రాష్ట్రపతి వ్యాఖ్యానించారు.

శ్రీ నారాయణ గురు సందేశానికి వర్తమాన ప్రపంచంలో మరింత సందర్భశుద్ధి ఉందని రాష్ట్రపతి స్పష్టం చేశారు. ఏకత్వం, సమానత్వం, పరస్పర ఆదరణ.. భావాలు మానవ జాతి సంఘర్షణల్ని సమసిపోయేటట్లు చేసే చిరకాల పరిష్కారమార్గాలని శ్రీమతి ముర్ము అన్నారు. శ్రీ నారాయణ గురు ఇచ్చిన ఏకత్వ సందేశం మానవులు అందరిలోనూ ఒకే దివ్యత్వ సారం ఉన్నదని మనకు గుర్తు చేస్తుందని రాష్ట్రపతి తెలిపారు.

వికాసానికి, వినాశనానికి మధ్య పోరు.. బీహార్ ఎన్నికల ప్రచారంలో జేపీ నడ్డా

న్యూఢిల్లీ, అక్టోబర్ 23:బీహార్ ఎన్నికలను ఎన్డీయే 'వికాసానికి', ఇండియా కూటమి 'వినాశనానికి' మధ్య జరుగుతున్న పోరుగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు కేంద్ర మంత్రి జేపీ నడ్డా చెప్పారు. భాగస్వామ్య పక్షాలను అంతంచేసే పరాన్నజీవి పార్టీగా ఆయన కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డారు. లాలూప్రసాద్ యాదవ్ నేతృత్వంలోని ఆర్జేడీ.. రంగ్‌దారీ (దోపిడీ), జంగల్‌రాజ్ (ఆటవిక పాలన), దాదాగిరీ (దౌర్జన్యం) లకు ప్రతీక అని విమర్శించారు.

బీహార్‌లోని ఔరంగాబాద్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రసంగించారు. తాను పట్నాలోనే పుట్టానని, బీహార్‌లోనే 20 ఏళ్లు గడిపానని చెప్పారు. ఆర్జేడీ చీకటి యుగం గురించి తనకు తెలుసని నడ్డా పేర్కొన్నారు. యువతకు ఉపాధి కల్పిస్తామని, వలసలను అడ్డుకుంటామని తేజస్వీ యాదవ్ ఇచ్చిన హామీలు 'భూమికి ఉద్యోగం కుంభకోణం'లో ఆర్జేడీ ప్రమేయాన్ని గుర్తుచేస్తున్నాయని విమర్శించారు.

మాజీ గ్యాంగ్‌స్టర్ షహబుద్దీన్ తనయుడు ఒసామాకు రఘునాథ్‌పుర్ నుంచి టికెట్ ఇవ్వడంపై మండిపడ్డారు. బీహార్ విషయంలో ఆ పార్టీకి ఎంత శ్రద్ధ ఉందో ఇది తేటతెల్లం చేస్తుందన్నారు. తేజస్వి యాదవ్ ఆచరణలో సాధ్యంకాని హామీలు ఇస్తున్నారని బీజేపీ ఎంపీ, కేంద్ర మాజీ మంత్రి రవిశంకర్ ప్రసాద్ విమర్శించారు. '2.6 కోట్ల మందికి ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామని తేజస్వి చెబుతున్నారు. దీనికి రూ.12 లక్షల కోట్లు అవసరమవుతాయి. రాష్ట్ర మొత్తం బడ్జెట్ దాదాపు రూ.3 లక్షల కోట్లు. మరి ఎక్కడి నుంచి ఉద్యోగాలు కల్పిస్తారు?' అని ప్రశ్నించారు. ఓటర్లకు ఆర్జేడీ తప్పుడు వాగ్దానాలు ఇస్తోందని, ఆ పార్టీని రాష్ట్ర ప్రజలు విశ్వసించరని చెప్పారు.

908 కేజీల గంజాయి పట్టివేత.. ముగ్గురి అరెస్ట్

హైదరాబాద్, అక్టోబర్ 23: నగరంలోని బండ్లగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో భారీగా గంజాయి పట్టుబడింది. గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురు వ్యక్తులను సౌత్ ఈస్ట్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.2.70 కోట్ల విలువైన 908 కిలోల డ్రై గంజాయిని స్వాధీనం చేశారు. ఈ వ్యవహారంపై సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ చైతన్య కుమార్ మీడియాతో మాట్లాడుతూ వివరాలను వెల్లడించారు. గంజాయి సరఫరా చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను అరెస్టు చేశామన్నారు. బండ్లగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో మహారాష్ట్రకు గంజాయి తరలిస్తున్న నిందితుల్ని అరెస్టు చేశామని.. సుమారు 908 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. బహిరంగ మార్కెట్లో దీని ధర రూ.2.70 కోట్లు ఉంటుందని తెలిపారు. ఒడిశాలోని మల్కన్‌గిరి ప్రాంతం నుంచి హైదరాబాద్ మీదుగా మహారాష్ట్ర నాసిక్ వైపు రవాణా చేస్తున్నట్లు గుర్తించామన్నారు.

ఈ కేసులో ంు-1 మొహమ్మద్ కలీం ఉద్దీన్ డ్రైవర్/ గంజాయి ట్రాన్స్‌పోర్టర్, ంు-2 షేక్ సోహైల్, ంు-3 మొహమ్మద్ అఫ్జల్ ఏ అబ్బులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన రెహమాన్, ఒడిశాకు చెందిన జిథు , శ్రీకాకుళానికి చెందిన సురేష్, మహారాష్ట్రకు చెందిన మహేష్ ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు చెప్పారు. పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు కొనసాగుతోందన్నారు. మహారాష్ట్రకు చెందిన మహేష్ గంజాయిని కొనుగోలు చేస్తున్నాడని తెలిపారు. ఒడిశా రాష్ట్రంలోని మల్కన్‌గిరిలో మారుమూల అటవీ ప్రాంతంలో సురేష్ , జిథు గంజాయిని కొనుగోలు చేసి మహారాష్ట్రలో వివిధ ప్రాంతాలకు సరఫరా చేయడానికి ప్లాన్ చేశారని.. గంజాయి సరఫరాలో రెహమాన్ ప్రధాన రవాణాదారుడిగా వ్యవహరిస్తున్నాడని చెప్పారు. రిసీవర్ మహేష్ ఒడిశాలోని జిథు, సురేష్ వద్ద గంజాయి సేకరించారన్నారు. వారి నుంచి ఐషర్ డీసీఎం ట్రాన్స్‌పోర్ట్ వాహనం, నాలుగు మొబైల్ ఫోన్లను సీజ్ చేశామని చెప్పారు.

గంజాయిని హెచ్‌డీవీ ఈ సంచుల్లో నింపి, వాటిని జీడిపప్పు కింద దాచిపెట్టి టార్పాలిన్‌తో కప్పి రవాణా చేస్తున్నారని వివరించారు. హైదరాబాద్ మీదుగా నాసిక్, మహారాష్ట్ర వైపు రవాణా చేస్తున్నారన్నారు. పక్కా సమాచారంతో బండ్లగూడ వద్ద సోదాలు చేయగా గంజాయి పట్టుబడిందన్నారు. ప్రధాన నిందితుడు సురేష్ ఒక్క ట్రిప్‌కు రూ.3 నుంచి రూ.5లక్షల పారితోషికం ఇస్తానని రెహమాన్‌కు ఆఫర్ చేశాడని.. అందుకే గంజాయి నరఫరాకి దాంతో రెహమాన్ అంగీకరించాడన్నారు. నిందితులంతా చిన్ననాటి స్నేహితులుగా దర్యాప్తులో తేలిందని సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ చైతన్య కుమార్ పేర్కొన్నారు.

సీజీ ప్రాజెక్టు గేట్లు ఎత్తివేత



అమరావతి, అక్టోబర్ 23: శ్రీ సత్య సాయి జిల్లా కదిరి నియోజకవర్గం తనకల్లు మండలం లోని చెన్నారాయుని స్వామి గుడి సీజీ ప్రాజెక్ట్ నిండుకుండలా మారింది. దీంతో ఇరిగేషన్ అధికారుల నిర్ణయం మేరకు కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ప్రాజెక్టు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. ఇటీవలనే కర్ణాటక ప్రాంతంలో కురిసిన భారీ వర్షాల కారణంగా సిజి ప్రాజెక్టుకు వరద నీరు బాగా వచ్చింది. తాజాగా శ్రీ సత్య సాయి జిల్లాలో బంగాళాఖాతంలో ఏర్పడ్డ వాయుగుం డం కారణంగా రెండు మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో సిజి ప్రాజెక్టు పూర్తిగా నిండిపోయింది.

ఈ నేపథ్యంలో అధికారులు ప్రాజెక్టు గేట్లు ఎత్తి దిగువ ప్రాంతానికి నీటిని విడుదల చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు విషయాన్ని స్థానిక శాసన సభ్యులు కందికుంట వెంకటప్రసాద్ కు తెలిపి గురువారం సాయంత్రం నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా కందికుంట వెంకటప్రసాద్ ప్రాజెక్టులో జలహారతి ఇచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి తెలుగుదేశం తనకల్లు మండల నాయకులు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

రక్తహీనత, పోషణా లోపం లేని మెదక్ జిల్లాగా తీర్చిదిద్దాలి : కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్, అక్టోబర్ 23: పోషన్ అభియాన్ జాతీయ మిషన్ ఆధ్వర్యం లో ఏర్పాటుచేసిన పోషణ్ మాసం కార్యక్రమాన్ని శ్రీ శిశు సంక్షేమ శాఖ మెదక్ జిల్లా ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సంపూర్ణ ఆహారం, పిల్లలు ఆడుకునే బొమ్మలు, ప్రకృతిలో దొరికే ఆకుకూరలు, పిండి పదార్థాలతో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ.. రక్తహీనత, పోషణ లోపం లేని జిల్లాగా తీర్చిదిద్దాలన్నారు. బాల్య వివాహాలు జరిపిస్తే పెళ్లికొడుకు, తల్లిదండ్రులు, బంధుమిత్రులు, అంగన్‌వాడీ ఏఎన్ఎంలను జైల్లో వేస్తామన్నారు. బిడ్డ కడుపులో ఉన్నప్పటి నుండి ప్రసవం అయిన తర్వాత వైద్య పరంగానే కాకుండా.. పోషణ పరంగా కూడా ప్రభుత్వం శ్రద్ధ పెడుతుందన్నారు. అంగన్వాడీ సెంటర్లలో ప్రతి రోజు కోడిగుడ్లు, పాలు ఇస్తున్నారని వాటి ద్వారా కడుపులో ఉన్న బిడ్డలకు పోషకాహారం అందాలని తెల్లటి అన్నం మాత్రమే తినడం వల్ల రక్తం రాదని.. ప్రతి మహిళ ప్రసవానికి బిడ్డకు.. బిడ్డకు కనీసం మూడు సంవత్సరముల గ్యాప్ ఉండాలన్నారు.

గర్భిణీలు, బాలింతలు తప్పనిసరిగా అంగన్వాడి కేంద్రంలోని పాలు, గుడ్లు ఆహారం తీసుకోవాలన్నారు. చిన్నారులు, బాలింతలు, గర్భిణీలు, మహిళలు, కిషోర బాలికలను ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పోషణ మాసం నిర్వహిస్తున్నమన్నారు. ఇందులో భాగంగా ఆరోగ్యజీవనానికి కావాల్సిన పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తూ మహిళలు, గర్భిణీల శిశువుల ఆరోగ్యానికి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు.

రక్త హీనత లేకుండా చూడడంలో మరింత దృష్టి పెట్టాలని.. గర్భిణీలకు ఇస్తున్న ఆహారాన్ని వారు మాత్రమే తినాలని.. ఇతరులు తీసుకోవద్దన్నారు. నిర్ణీత గడువులోపు తీసుకోవాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే చిన్న చిన్న పిల్లలను చూసుకోవడంలో అంగన్వాడీ టీచర్లు బాధ్యతయుతంగా ఉంటారని.. అందుకు వారిని అభినందించాలన్నారు. ప్రీ ప్రైమరీ విద్యకు సంబంధించి.. ఎలా భోదిస్తే పిల్లలకు సులభంగా అర్థమవుతుందో.. అలాగే అంగన్వాడీ టీచర్లు చెప్పాలన్నారు.

గర్భిణీలకు, శిశువులకు ఆరోగ్యం పట్ల అవగాహన పెరగాలి..

పోషణ మాసంలో భాగంగా జరిగే కార్యక్రమాల ద్వారా గర్భిణీలకు, శిశువులకు మంచి ఆరోగ్యం పట్ల అన్ని అంశాల మీద అవగాహన పెరగాలన్నారు. వ్యక్తిగత శుభ్రత, ఐరన్ టాబ్లెట్లు వేసుకోవడం, ఫీడింగ్ విషయంలో జాగ్రత్తల మీద అందరికి అవగాహన ఉండాలన్నారు. గర్భిణి స్థాయి నుండి బిడ్డకు 3 సంవత్సరాలు వచ్చే వరకు ఆ మహిళను జాగ్రత్తగా చూసుకుంటేనే వారి ఆరోగ్యానికి మంచి పునాది వేసినట్లు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో చివరగా శ్రీశిశు సంక్షేమ శాఖలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను కలెక్టర్ అందజేశారు. బాల్య వివాహాలు నిలిపివేయాలంటూ బ్యానర్‌ను ఆవిష్కరించారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గర్భిణీలకు శ్రీమంత కార్యక్రమము నిర్వహించారు.

ఈ కార్యక్రమం లో జిల్లా సంక్షేమ అధికారి హేమా భార్గవి, జెడ్పి సీఈఓ ఎల్లయ్య, అడిషనల్ డిఆర్డిఓ , ఎస్సీ సంక్షేమ శాఖ అధికారిని, విజయలక్ష్మి, ఎంనిహెచ్‌డీఎంఈలు, విజయనిర్మల, జయలక్ష్మి , జిల్లాలోని గర్భిణీ స్త్రీలు, బాలింతలు, సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, పోషణ అభియాన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో పలు ప్రాంతాల్లో వర్షం..

హైదరాబాద్, అక్టోబర్ 23:రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో మళ్లీ వర్షాలు మొదలయ్యాయి.

ఇవాళ ఉదయం నుంచి పలు ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై ఉంది. ఇక సాయంత్రానికి నగరంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది.

ముషీరాబాద్, అశోక్ నగర్, గాంధీ నగర్, చిక్కడపల్లి, ఆర్టీసీ క్రాస్ రోడ్, భోలక్‌పూర్, కవాడిగూడ, దోమలగూడ, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, హైదర్ నగర్, ఆల్విన్ కాలనీ, ప్రగతి నగర్, దుండిగల్, గండి మైసమ్మ, మల్లంపేట, సూరారం, కొంపల్లి, జగద్గిరిగుట్ట, జీడిమెట్ల, బాలానగర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, కృష్ణానగర్‌తో పాటు పలు ప్రాంతాల్లో వర్షం కురిఈ వర్షానికి పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దీంతో నగరంలోని ప్రధాన ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. ఈ క్రమంలో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఓయూ వీసీ ప్రొఫెసర్ కుమార్‌ను అభినందించిన వివిధ విద్యార్థి సంఘాల నాయకులు

హైదరాబాద్, అక్టోబర్ 23:ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్‌గా సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రొఫెసర్ ఎం. కుమార్‌ను వివిధ విద్యార్థి సంఘాల నాయకులు, పరిశోధక విద్యార్థులు కలిసి అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ సంవత్సర కాలంగా వర్సిటీ ఖ్యాతిని పెంపొందించేందుకు విశేష కృషి చేశారని కొనియాడారు.

ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్, టీఎస్‌పీజేఏసీ, భీమ్ ఆర్మీ విద్యార్థి విభాగం, ఎన్ఎస్ఎఫ్, తదితర సంఘాల నాయకులు కొమ్ము శేఖర్, వలిగొండ నరసింహ, తీగల శివ, వల్లపు చందు, కాంతి ప్రణయ్‌కుమార్, వేదాంత్ మౌర్య, మంద రాజు, పోతురాజు రాము, పల్లె అర్జున్, రవీందర్, అజయ్, నిశాంత్, ప్రమోద్, అఖిల్, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ఇంజెక్షన్ ఇచ్చిన నర్సు.. చేయి కోల్పోనున్న నవజాత శిశువు

లక్నో, అక్టోబర్ 23:నవజాత శిశువుకు ఒక నర్సు తప్పుడు ఇంజెక్షన్ ఇచ్చింది. దీంతో చేయి ఉబ్బడంతోపాటు నీలం రంగులోకి మారింది. ఈ నేపథ్యంలో ఆ శిశువు చేతిని కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. ఉత్తరప్రదేశ్ లోని గ్రేటర్ నోయిడాలో ఈ సంఘటన జరిగింది. అక్టోబర్ 5న పండంటి ఆడ బిడ్డకు ఒక మహిళ జన్మనిచ్చింది. ఆ పసిపాప ఆరోగ్యం క్షీణించడంతో ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌లో అడ్మిట్ చేశారు.

కాగా, ఆ హాస్పిటల్‌లోని నర్సు నవజాత శిశువుకు తప్పుడు ఇంజెక్షన్ ఇచ్చింది. దీంతో ఆ బిడ్డ చేయి ఉబ్బడంతోపాటు వేళ్లు నీలం రంగులోకి మారాయి. ఈ నేపథ్యంలో ఆరోగ్యం విషమించడంతో ఆ శిశువును మరో రెండు ఆసుపత్రులకు తీసుకెళ్లారు. అయితే తీవ్ర ఇన్ఫెక్షన్ సోకి కుళ్లిన శిశువు చేతిని తొలగించాల్సి ఉందని డాక్టర్లు చెప్పారు. దీంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు.



ఐరాసతో ప్రపంచ శాంతి సాధ్యమా !

(24 అక్టోబర్ "ఐరాస ఆవిర్భావ దినోత్సవం" సందర్భంగా)

2వ ప్రపంచయుద్ధం నేర్పిన గుణపాఠాలను పునాదులుగా చేసుకొని 26 జూన్ 1945 రోజున 51 దేశాలు తీసుకున్న నిర్ణయంతో 24 అక్టోబర్ 1945 రోజున ఐక్యరాజ్యసమితి (ఐరాస) స్థాపించబడే ఒక సంస్థ అనివార్యంగా ఏర్పడింది. 'యునైటెడ్ నేషన్స్' అనే పదాన్ని అప్పటి అమెరికా అధ్యక్షుడు ఫ్రాంక్లిన్ రూజ్‌వెల్ట్ రూపొందించారు. అమెరికాలోకి న్యూయార్క్ ప్రధాన కేంద్రంగా ప్రారంభమైన ఐరాసలో నేడు 193 (రెండు పరిశీలన దేశాలుగా ఉండగా) దేశాలు సభ్యత్వాన్ని కలిగి ఉన్నాయి. స్వతంత్ర దేశాలుగా గుర్తింపు పొందని నార్త్ సైప్రస్, సొమాలిల్యాండ్, అబ్కాజియా లాంటి రాజ్యాలకు ఐరాస సభ్యత్వం ఇవ్వలేదు. వాటికన్ సిటీ, పాలస్తీనాలు సభ్యత్వాన్ని పొందలేదు. గత 80 సంవత్సరాలుగా ప్రపంచ దేశాల మధ్య విభేదాలను పరిష్కరించే తటస్థ వేదిక రూపంలో మధ్యవర్తిత్వం వహిస్తూ, పలు వివాదాల పరిష్కారానికి నిర్విరామం కృషి చేస్తూ, మానవాళికి కరోనా మహమ్మారి లాంటి ప్రకృతి విపత్తు జరిగినపుడు ప్రజలను చైతన్య పరిచే ఐక్యరాజ్యసమితి "ఎనిమిది దశాబ్దాల వ్యవస్థాపక వేడుకలు' చేసుకుని శతాబ్ది ఉత్సవాల స్థాయికి ఎదగడానికి ఉవ్విళ్లూరుతూ విశ్వ మానవళికి సేవలు అందించడం సంతోషదాయకం.

ఐరాస పేపర్ టైగర్‌గా మారిందా !

ఐరాస జనరల్ అసెంబ్లీ తీర్మానం ప్రకారం ప్రతియేటా 24 అక్టోబర్ రోజున సభ్యదేశాలు "ఐక్యరాజ్యసమితి దినోత్సవాన్ని" ఘనంగా నిర్వహించుట జరుగుతోంది. ప్రపంచ మానవాళిని విపత్తులు, పలు యుద్ధాలు, వాతావరణ ప్రతికూల మార్పులు కల్లోల పరుస్తున్న వేళ, దేశాలన్ని ఆర్థిక, సామాజిక, ఆరోగ్య సమస్యలతో సతమతమవుతున్న అకాలంలో ఐరాస 79వ వ్యవస్థాపక దినోత్సవాన్ని జరుపుకోవలసి వస్తున్నది. అత్యవసర సమయాల్లో సత్వరమే స్పందిస్తూ, ప్రపంచ దేశాలకు తగు పరిష్కారాలను సూచిస్తూ, ప్రపంచశాంతి స్థాపన యజ్ఞంలో తన వంతు బాధ్యతలను నిర్వహిస్తున్న ఐరాస సేవలు ప్రశంసనీయమని కొనియాడబడుతున్నప్పటికీ ప్రస్తుతం కొనసాగుతున్న ఉక్రెయిన్-రష్యా, ఇజ్రాయిల్ - పాలస్తీనా యుద్ధాలకు మధ్యవర్తిత్వం సఫలం కాకపోవడం, పేపర్ టైగర్‌గా మారడంతో ఐరాస ఉనికి ప్రశ్నార్థకంగా మారిందని విమర్శలు వింటున్నాం.

ఐరాస ప్రధాన అంగాలు:

ఐరాస అధికార భాషలుగా అరాబిక్, చైనీస్, ఇంగ్లీష్, ఫ్రెంచ్, రష్యన్ మరియు స్పానిష్‌లు గుర్తించబడ్డాయి. ఐరాసలో ముఖ్యమైన 6 విభాగాలలో జనరల్ అసెంబ్లీ, సెక్యూరిటీ కౌన్సిల్, ఎకనమిక్ అండ్ సోషల్ కౌన్సిల్, ఇంటర్నేషనల్ కోర్ట్ ఆఫ్ జస్టిస్, సెక్రటేరియట్ మరియు ట్రస్టీషిప్ కౌన్సిల్‌లు (క్రియాశీలంగా లేదు) వస్తాయి. ఐరాస ప్రధాన విధులలో అంతర్జాతీయ శాంతి మరియు భద్రతల స్థాపన, దేశాల మధ్య స్నేహబంధాలను నెలకొల్పడం జరుగుతున్నది. దేశాల మధ్య నెలకొన్న ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక మరియు మానవీయ సమస్యకు పరిష్కారాలు చూపుతూ, మానవహక్కులను కాపాడుతూ మౌళిక స్వేచ్ఛను కల్పించడం జరుతున్నది. విపత్తులు, యుద్ధాలు విజృంభించిన వేళ ప్రజలను జాగృత పరచడం, పర్యావరణ కాలుష్య నియంత్రణ, భూగోళాన్ని పరిరక్షించడం లాంటి అతి ముఖ్యమైన అంశాలలో ప్రపంచ దేశాలను చైతన్య పరచడం జరుగుతున్నది. దేశాల మధ్య సమానత్వం, నమ్మకాలను గౌరవించడం, దేశ అంతర్గత సమస్యలకు దూరంగా ఉండడం, సరిహద్దు వివాదాలను శాంతియుతంగా పరిష్కరించడం లాంటి సూత్రాల ఆధారంగా ఐరాస పని చేస్తున్నది. ఐరాసకు అవసరమైన నిధులను సభ్యదేశాలే అందిస్తాయి. ఐరాసలో ముఖ్య ఏజన్సీలుగా యునిసెఫ్, ఐయల్ఓ, యఫ్ఏఓ, డబ్ల్యూహెచ్ఓ, ఐయంయఫ్, వరల్డ్ బ్యాంక్ లాంటి 15 ఏజన్సీలు తమ తమ విధులను నిర్వహిస్తున్నాయి.

భారత్‌కు భద్రతామండలిలో చోటు అందని ద్రాక్షేనా !

అంతర్జాతీయ శాంతి స్థాపనలో ప్రధాన భూమిక నిర్వహిస్తున్న యుయన్ఓ భద్రతా మండలి (సెక్యూరిటీ కౌన్సిల్)లో ఐదు అగ్రరాజ్యాలు అమెరికా, రష్యా, యుకె, ఫ్రాన్స్, చైనాలు శాశ్వత సభ్యులుగా వీటో పవర్‌ను కలిగి ఉంటాయి. భద్రతా మండలిలో మరో 10 దేశాలకు 2 సంవత్సరాల వ్యవధితో తాత్కాలిక వీటో లేని సభ్యత్వాన్ని కల్పిస్తారు. ఇండియా తాత్కాలిక సభ్యత్వ దేశంగా సేవలందించడం జరిగింది. ప్రస్తుత సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్ ముఖ్య పరిపాలనాధికారిగా (సిఏఓ) సేవలందిస్తున్న ఐరాస నిర్దేశిత నియమాలను తీవ్రంగా ఉల్లంఘించిన దేశాన్ని భద్రతా మండలి సిఫార్సుతో జనరల్ అసెంబ్లీ ఆ దేశ సభ్యత్వాన్ని రద్దు కూడా చేయవచ్చు. ప్రపంచ దేశాల్లో ఒక ప్రధానమైన 145 కోట్ల జనాభాతో కూడిన దేశంగా భారత్‌కు భద్రతామండలిలో చోటు దక్కకపోవడం, చైనా లాంటి దేశాలు అడ్డుపుల్లలు వేయడం విస్మయాన్ని కలిగిస్తున్నది.

అనేక మైలురాళ్లు, అడ్డంకులు దాటుతుంటూ..!

ఆవిర్భావం నుంచి నేటి వరకు ఐరాస నిర్వహించిన పాత్ర ప్రశంసనీయంగా ఉంటూనే కొన్ని సందర్భాలలో నిరాశనే మిగిల్చిందని చరిత్ర చెబుతోంది.

అనేక ఆటంకాలు, సవాళ్ల నడుమ తన ఉనికిని చాటుకుంటూ, ప్రపంచదేశాలలో శాంతి స్థాపన దిశగా అడుగులు వేస్తున్నది. ఐరాస చరిత్రలో ఎన్ని మైలురాళ్ళు దాటినా, కొన్ని విషమ పరిస్థితులలో తగు న్యాయం చేయలేక పోయిందనే విమర్శలను మూటకట్టుకుంది.

అమెరికా - ఇరాక్‌ల మధ్య వివాదం, సూడాన్‌లో అకాల మరణాలను అరికట్టడం, నేడు కొనసాగుతున్న యుద్ధాలకు ముగింపు పలకడం లాంటి సందర్భాల్లో ఐరాస విఫలమైందని తెలుస్తున్నది. ఐరాస ఎదుర్కొంటున్న సవాళ్ళలో పేదరికం, అనారోగ్య సమస్యలు, పర్యావరణ కాలుష్యం, దేశాల మధ్య సంఘర్షణలు, మానవ హక్కుల ఉల్లంఘనలు, హింస, ఉగ్రవాదం, వ్యవస్థీకృత నేరాలు, అయుధ సంపత్తి విస్తరణ లాంటివి ముఖ్యమైనవి గుర్తించబడినవి.

నేడు భీకరంగా జరుగుతున్న యుద్ధాలతో పాటు అమెరికా చైనాల మధ్య నెలకొన్న ప్రచ్ఛన్నయుద్ధ వాతావరణం ఐరాస లక్ష్యాలను ప్రశ్నార్థకం చేస్తున్నాయి.

అగ్రరాజ్యాల ఆదిపత్య ధోరణిలతో ఐరాస కార్యదక్షత అయోమయంలో పడుతున్నదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ఆయుధాలతో అగ్రరాజ్య స్థాయి సాధ్యపడదని, విశ్వమానవాళికి సుఖ సంతోషాలు పంచగలగడమే పెద్దరికం అవుతుందని అగ్ర దేశాలు గుర్తించాలి.

ప్రపంచశాంతి స్థాపనలో ఐరాస పెద్దన్న వలె నిలబడి, దేశాల మధ్య విభేదాలను చెరిపి, అవసరమైతే కొరడా జులిపి, సహకార భావనను పెంచి, ప్రపంచ కుగ్రామాన్ని సుందర నివాస ప్రదేశంగా నిర్మించాలని ఆశిద్దాం. ఐరాసను గౌరవిద్దాం, ప్రపంచశాంతికి పునాదులు వేద్దాం.

-డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

న్యూఢిల్లీ రైల్వే స్టేషన్లో ప్రయాణికుల ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించిన రైల్వే మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్

న్యూఢిల్లీ, అక్టోబర్ 23:రైల్వే, సమాచార, ప్రసార, ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖల మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్ ఈరోజు న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌ను సందర్శించారు. ప్రస్తుత పండుగ సీజన్ సందర్భంగా ప్రయాణికుల కోసం రైల్వేలు చేసిన ఏర్పాట్లను ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అనంతరం శ్రీ అశ్విని వైష్ణవ్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ, ప్రయాణీకులు సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవడానికి 12 లక్షల మంది రైల్వే ఉద్యోగులు పగలు, రాత్రి శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. ప్రత్యేక రైళ్ల ద్వారా ఇప్పటికే కోటిమందికి పైగా ప్రయాణీకులకు సేవలు అందించామని ఆయన తెలిపారు.

ఒక్క ఢిల్లీ ప్రాంతం నుంచే సగటున రోజుకు సుమారు 4.25 లక్షల మంది ప్రయాణిస్తున్నారని రైల్వే మంత్రి తెలిపారు. సూరత్, ముంబై, కోయంబత్తూర్, హైదరాబాద్, బెంగళూరు వంటి ప్రధాన స్టేషన్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, అంతేకాకుండా ప్రయాణంలో ఉన్న రైళ్ల సమయాన్ని కూడా నిశితంగా ట్రాక్ చేస్తున్నామని ఆయన చెప్పారు. ప్రతి డివిజన్, జోన్ లో అంకిత భావం కలిగిన ఉద్యోగులతో ప్రత్యేక వార్ రూమ్ ద్వారా నిరంతర పర్యవేక్షణ జరుగుతోందని పేర్కొన్నారు.

ప్లాట్‌ఫామ్ నెంబర్ వన్ పై ఉన్న రైల్వే రక్షణ దళం (ఆర్పీఎఫ్) కంట్రోల్ రూమ్‌ను కేంద్ర మంత్రి సందర్శించారు. ఈ కంట్రోల్ రూమ్ మొత్తం స్టేషన్‌ను పర్యవేక్షిస్తుంది. అక్కడ ఆయన క్షేత్ర స్థాయి ఏర్పాట్లపై ప్రయాణీకులతో మాట్లాడారు. ప్రాథమిక ఆరోగ్య గదిని కూడా సందర్శించి, విధుల్లో ఉన్న వైద్యులతో సంభాషించారు.

న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లోని ప్లాట్‌ఫామ్ నెం. 16 పై ఉన్న పట్నాకు వెళ్లే అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రయాణీకులతో కూడా మంత్రి మాట్లాడారు. తమ కోసం భారతీయ రైల్వేలు చేసిన ఏర్పాట్ల పట్ల ప్రయాణీకులు చప్పట్లతో సంతోషం వ్యక్తం చేశారు. ప్రయాణీకుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన యాత్రి సువిధా కేంద్రాన్ని కూడా ఆయన సందర్శించారు.

రైల్వే బోర్డు ఛైర్మన్, సిఈఓ శ్రీ సతీష్ కుమార్, ఉత్తర రైల్వే జనరల్ మేనేజర్ శ్రీ అశోక్ కుమార్ వర్మ, ఇతర సీనియర్ అధికారులు కూడా మంత్రి వెంట ఉన్నారు.

న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌ను సందర్శించే ముందు, శ్రీ అశ్విని వైష్ణవ్ రైల్ భవన్ వార్ రూమ్ నుంచి ప్రత్యేక రైళ్లకు సంబంధించిన సమాచారాన్ని కూడా సమీక్షించారు. ప్రయాణీకుల సౌకర్యాలపై రైల్వే అధికారులకు ముఖ్యమైన సూచనలను జారీ చేశారు.

భారతీయ రైల్వే 2024 పండగ సీజన్లో 7,724 ప్రత్యేక రైళ్లు నడపగా ఈ ఏడాది పండుగ సీజన్ లో పెరిగిన రద్దీకి అనుగుణంగా 12,011 ప్రత్యేక రైళ్లను అందుబాటులోకి తెచ్చింది.

భారతీయ రైల్వే 2025 అక్టోబర్ ఒకటి - అక్టోబర్ 20 తేదీల మధ్య భారతీయ రైల్వేలు సాధారణ రైలు సర్వీసులతో పాటు 4,211 ప్రత్యేక రైళ్లను విజయవంతంగా నడిపి, కోటిమందికి ప్రయాణీకులకు సేవలు అందించింది. దీపావళి, ఛత్ పూజ సందర్భంగా ప్రయాణీకుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉన్నందున, రాబోయే రోజుల్లో సుమారు మరో 7,800 ప్రత్యేక రైళ్లను నడపడానికి కూడా భారతీయ రైల్వే ప్రణాళికలు రూపొందించింది.

2025 అక్టోబర్ 1 నుంచి 20వ తేదీ మధ్య ప్రత్యేక రైళ్ల ద్వారా కోటిమంది పైగా ప్రయాణించారు. న్యూఢిల్లీ ప్రాంతంలో అక్టోబర్ 16 - 20 తేదీల మధ్య 21.04 లక్షల మంది ప్రయాణించారు. గత సంవత్సరం ఇదే కాలంలో ప్రయాణించిన 19.71 లక్షలమందితో పోలిస్తే ఇది 1.33 లక్షలు ఎక్కువ.

ప్రయాణీకులకు సౌకర్యాన్ని, సౌలభ్యాన్ని మెరుగుపరచడానికి భారతీయ రైల్వే విస్తృతమైన ప్రయత్నాలు చేస్తోంది. ప్రత్యేక వసతి ప్రాంతాలు, అదనపు టికెట్ కౌంటర్లు, సురక్షితమైన తాగునీటి సౌకర్యాలు, పరిశుభ్రమైన మరుగుదొడ్లతో అన్ని స్టేషన్లలో ప్రయాణీకుల నిర్వహణను పటిష్టం చేశారు.

పండుగల సందర్భంగా ప్రయాణీకుల భారీ రద్దీని పర్యవేక్షించి, నిర్వహించడానికి భారతీయ రైల్వే, రైల్ భవన్‌లో ఒక ప్రత్యేక వార్ రూమ్‌ను ఏర్పాటు చేసింది. ఈ కమాండ్ సెంటర్ ద్వారా వాస్తవ సమయ పర్యవేక్షణ సాధ్యమవుతుంది. దీనివల్ల రద్దీ, ప్రయాణీకుల ఫిర్యాదులు, అవకాశం ఉన్న అవాంఛనీయ సంఘటనలను తక్షణమే పరిష్కరించడానికి వీలు కలుగుతుంది. రైల్వే మంత్రిగా శ్రీ అశ్విని వైష్ణవ్ బాధ్యతలు స్వీకరించిన వెంటనే, ఆయన మార్గదర్శకత్వంలో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. రైల్వే వ్యవస్థ అంతటా భద్రత పర్యవేక్షణను బలోపేతం చేయడమే దీని ముఖ్య ఉద్దేశ్యం.

శ్రీ వైష్ణవ్, రైల్వే బోర్డు ఛైర్మన్, సీఈఓ శ్రీ సతీష్ కుమార్ రైల్ భవన్‌లోని వార్ రూమ్‌ను తరచూ సందర్శిస్తూ ప్రయాణీకుల డిమాండ్‌ను సమీక్షించి అధికారులకు అవసరమైన ఆదేశాలు ఇస్తున్నారు. నేడు ఈ వార్ రూమ్, రైల్వే బోర్డు, జోనల్, డివిజనల్ స్థాయిలలో 80కి పైగా క్రియాశీల వార్ రూమ్‌లతో, మొత్తం భారతీయ రైల్వే నెట్వర్క్ ను పర్యవేక్షించే ఒక ప్రభావవంతమైన వ్యవస్థగా అభివృద్ధి చెందింది.

ఇదే తరహాలో న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లో ఒక మినీ కంట్రోల్ రూమ్‌ను కూడా ఏర్పాటు చేశారు. ఇది ప్రయాణీకుల ఏర్పాట్లను నిశితంగా పర్యవేక్షిస్తూ, కార్యకలాపాలు సాఫీగా ఆపరేషన్లు జరగటానికి, ప్రయాణికులకు మరింత సౌకర్యాన్ని అందించడానికి సహాయపడుతోంది.

జైపూర్ స్టేషన్‌లో స్పెషల్ మొబైల్ అన్‌రిజర్వ్‌డ్ టికెటింగ్ సిస్టమ్ (ఎం - యూటీఎస్) ద్వారా ప్రయాణికులకు వారు వేచి ఉండే ప్రదేశాలలోనే నేరుగా టిక్కెట్లను జారీ చేస్తున్నారు. ఈ విధానం స్టేషన్‌లో క్రమశిక్షణను కాపాడటంలో సహాయపడటమే కాకుండా, ప్రయాణికులకు సౌకర్యవంతమైన, సంతృప్తికరమైన అనుభవాన్ని అందిస్తోంది.

పశ్చిమ రైల్వేకు చెందిన వడోదర డివిజన్ కూడా పెరిగిన ప్రయాణికుల రద్దీని నియంత్రించడానికి అన్ని విధాలా ప్రయత్నిస్తోంది. అక్టోబర్ 1వ తేదీ నుంచి వడోదర డివిజన్ నడుపుతున్న సాధారణ రైళ్లు, 5 ప్రత్యేక రైళ్ల ద్వారా 30 లక్షలమందికి పైగా ప్రజలు ఉత్తర ప్రదేశ్, బీహార్, పశ్చిమ బెంగాల్‌లోని తమ గమ్యస్థానాలకు ప్రయాణించారు. ఈ డివిజన్ ఐదు పండుగ ప్రత్యేక రైళ్లను నడుపుతుండగా, ఇప్పటికే 70కి పైగా ట్రిప్పులు నమోదయ్యాయి.

ఈరోజు ఉధ్నా రైల్వే స్టేషన్‌లో రద్దీ ఎక్కువగా ఉన్న సమయంలో ప్రయాణికులకు 5,000 ప్యాకేజ్డ్ మంచినీటి బాటిళ్లను పంపిణీ చేశారు.

తంజావూర్ జంక్షన్‌లో ఇటీవల వృద్ధ ప్రయాణికులు శుభ్రమైన సౌకర్యాలతో ఉన్న ఏసీ రిటైరింగ్ రూమ్‌లను ఉపయోగించడం - ప్రయాణికులకు మెరుగైన అనుభవాన్ని అందించే విధంగా ఆలోచనాత్మకమైన, సేవా ఆధారిత సౌకర్యాలను కల్పించడంపై భారతీయ రైల్వేల నిబద్ధతను చాటుతుంది.

ప్రస్తుత పండుగ సీజన్‌లో ప్రయాణికులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన, మెరుగైన సమన్వయంతో కూడిన ప్రయాణాన్ని అందించడానికి భారతీయ రైల్వేలు అప్రమత్తంగా పనిచేస్తున్నాయి. అదే సమయంలో, సోషల్ మీడియా వేదికల ద్వారా వ్యాప్తి చెందుతున్న తప్పుడు సమాచారాన్ని అరికట్టడానికి కూడా చురుకైన చర్యలు తీసుకుంటోంది.

కొన్ని సోషల్ మీడియా ఖాతాలు రైళ్లు, స్టేషన్లు రద్దీగా, ప్రయాణికులకు అసౌకర్యంగా ఉన్న పాత ఫోటోలు, వీడియోలను సర్క్యులేట్ చేస్తూ, ప్రయాణికులలో అనవసరమైన భయాందోళనలను సృష్టిస్తున్నట్లు గుర్తించారు. ఈ విజువల్స్ ను చాలా వరకు ఎటువంటి ఆధారం లేకుండా షేర్ చేస్తున్నారు. వాటిని కొత్తగా జరిగిన వవిగా ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయి. అధికారిక జోనల్ సోషల్ మీడియా ఖాతాలు ఈ విషయంలో చురుకుగా స్పందించి వాటిని నిరాధారమైననిగా నిరూపిస్తున్నాయి. అటువంటి తప్పుదారి పట్టించే కంటెంట్‌ను పాతది, అసత్యమైనదిగా ఆధారాలతో చూపిస్తున్నాయి.

గత ఐదు రోజుల్లో, ఇలాంటి తప్పుదారి పట్టించే 40కి పైగా కేసులను గుర్తించి, వాటిని ఫ్లాగ్ చేశారు. తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్న వారిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేస్తున్నారు. ప్రయాణికుల భద్రత, ప్రజల విశ్వాసం దెబ్బతినకుండా ఉండేందుకు ప్రభుత్వం తక్షణ, దృఢమైన చర్యలు తీసుకుంటోంది.

గతంలో లేనంతగా పండుగ కార్యకలాపాలు

రైల్వే ప్రయాణికులు కూడా ఈ ఏడాది మెరుగైన ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. చాలా మంది తమ అనుభవాలను పంచుకుంటూ, ఈసారి ఏర్పాట్లు గతంలో కంటే చాలా మెరుగ్గా ఉన్నాయని, మొత్తం ప్రయాణం సాఫీగా, సౌకర్యవంతంగా సాగిందని చెప్పారు.

ప్రయాగ్‌రాజ్, వల్సాడ్, విశాఖపట్నం, నంబల్‌పూర్ స్టేషన్‌లలోని ప్రయాణికులు భారతీయ రైల్వే చేసిన ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు, రిజర్వేషన్ లేని కోచ్‌లలో కూడా మెరుగైన సౌకర్యాలు, నిర్వహణను ప్రశంసించారు.

భారతీయ రైల్వే లేడీస్ సర్కిల్ ఇండియాతో కలిసి, ప్రాజెక్ట్ ఆయుష్మాన్ కింద మైసూరు రైల్వే స్టేషన్ రెండవ ప్లాట్‌ఫారమ్ లో మొట్టమొదటి నర్సింగ్ గదిని ఆవిష్కరించింది. తల్లులు, శిశువులకు ప్రశాంతమైన, పరిశుభ్రమైన, సురక్షితమైన ఈ ప్రత్యేక ప్రదేశం ప్రయాణ సమయంలో గోప్యత, గౌరవం, సౌకర్యాన్ని కల్పిస్తుంది. ఎయిర్ కండిషన్డ్, మంచి వెలుతురుతో, అత్యున్నత పరిశుభ్రత ప్రమాణాలతో నిర్వహిస్తున్న ఈ నర్సింగ్ గది, ఎక్కువ సేపు ఆగాల్సి వచ్చినప్పుడు, రాత్రిపూట రైళ్లు మారాల్సిన సమయంలో లేదా పండుగ రద్దీలో తల్లుల అవసరాలను తీరుస్తుంది.

భారతీయ రైల్వే ఇటీవల సాధించిన ప్రగతిలో లక్నో సిటీ రైల్వే స్టేషన్ ఉత్తర భారతదేశపు మొట్టమొదటి పూర్తిస్థాయి మహిళా సిబ్బందితో నడిచే స్టేషన్‌గా అవతరించడం ఒక ముఖ్యాంశం. ఇది సాధికారత, లింగ సమానత్వంలో కొత్త ప్రమాణాలను నెలకొల్పింది. కంట్రోల్ రూమ్ నుంచి టికెట్ కౌంటర్లు, భద్రతా గస్తీ నుంచి సిగ్నల్ క్యాబిన్‌ల వరకు అన్ని కార్యకలాపాలను ఇప్పుడు 34 మంది సభ్యులతో కూడిన మూర్తి మహిళా బృందం నిర్వహిస్తోంది. ఈశాన్య రైల్వే ప్రారంభించిన ఈ చరిత్రాత్మకమైన చర్య, మహిళా శక్తిని ఆచరణలో ప్రతిఫలింపజేస్తూ, ప్రయాణికులకు భద్రమైన, సమ్మిళితమైన ఉత్తేజపూరిత వాతావరణాన్ని సృష్టిస్తోంది.

వైద్య సంసిద్ధతను, అంకితభావాన్ని ప్రదర్శిస్తూ, పాలక్కాడ్ జంక్షన్ (దక్షిణ రైల్వే) డివిజనల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జితిన్ పి.ఎస్, కన్యాకుమారి - దిబ్రూగఢ్ వివేక్ ఎక్స్‌ప్రెస్ బయలుదేరడానికి కేవలం నిమిషాల ముందు ప్లాట్‌ఫారమ్‌పై 24 ఏళ్ల ప్రయాణీకుడి దవడకు చికిత్స చేశారు. అత్యవసరంగా చేతితో దవడను సరిచేసే ప్రక్రియను కచ్చితత్వంతో నిర్వహించారు, దీనివల్ల ప్రయాణీకుడు వెంటనే కోలుకుని, ఆలస్యం లేకుండా తన ప్రయాణాన్ని కొనసాగించగలిగాడు. ఈ తక్షణ స్పందనకు సోషల్ మీడియాలో విస్తృత ప్రశంస లభించింది. ప్రధాన స్టేషన్లలో భారతీయ రైల్వే ఏర్పాటు చేసిన నిరంతర (24/7) వైద్య సంసిద్ధత, శిక్షణ పొందిన నిపుణుల అందుబాటు, అత్యవసర ఆరోగ్య సంరక్షణ మౌలిక సదుపాయాలను ఇది ప్రముఖంగా తెలియచేస్తుంది.

భారతీయ ప్రయాణీకులకు భద్రత, పారదర్శకత, మెరుగైన సేవలు అందించడం పట్ల భారతీయ రైల్వే తన నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ, ప్రయాణ సంబంధిత తాజా వివరాల కోసం కేవలం అధికారిక ఛానెళ్ల పైన, నిర్ధారిత సమాచారం పైన మాత్రమే ఆధారపడాలని ప్రజలను కోరుతోంది.

నముద్రాల రాములు పెద్దకర్మ కార్యక్రమంలో పాల్గొన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు

ఖమ్మం, అక్టోబర్ 23 (నేతినిజం ప్రతినిధి) :కొనిజర్ల మండలని లింగగూడెం పంచాయితీ బస్వాపురం గ్రామంలో నముద్రాల ఆంకలు, నాగేశ్వరరావు, నాగ భూషణం తండ్రి పెద్ద రాములు దశదిన కార్యక్రమంలో పాల్గొని వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించి వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపిన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కోసూరి శ్రీనివాసరావు, తూము అప్పారావు, కొనకంచి మోషే, నల్లమోతు లక్ష్మయ్య, తాటిపల్లి శ్రీనివాసరావు, నముద్రాల ఏళ్ళరావు, నాగేశ్వరరావు, చల్లా బాబు, భాస్కర్, వెంకటేశం, కందుల ఏడుకొండలు, నాగేశ్వరరావు, నముద్రాల బాబు, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో మాగంటి సునీతా గోపినాథ్ గెలుపు ఖాయం

హైదరాబాద్, అక్టోబర్ 23: (నేటినిజం ప్రతినిధి): భారత రాష్ట్ర సమితి పార్టీ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల అభ్యర్థి మాగంటి సునీతా గోపినాథ్ గెలుపు కొరకు షెక్‌పేట డివిజన్ బూత్ 25లో ముషీరాబాద్ ఎంఎల్ఏ షెక్‌పేట్ ఇంఛార్జ్ ముఠా గోపాల్‌గారు మరియు ముఠా జయసింహా గార్ల తరపున గాంధీనగర్ డివిజన్ ఉపాధ్యక్షుడు ఎస్.టి. ప్రేమ్ మరియు మనికొండ నాయకులు ఆరీఫ్, నాగేందర్ మరియు స్థానిక నాయకులు మల్లికార్జున్, రవి, నరసింహ, అశోక్, ఫైయజ్ మొద లగు వారు ఇంటి ఇంటికి తిరుగుతు ప్రచారం కొనసాగించారు.

ప్రజలు కాంగ్రెస్ పాలనకు విసుగు చెందామని వాపోయారు. తప్పకుండ సునీత గారికి విజయం తధ్యమని తెలిపారు.

ఘనంగా 'ఉడాన్' పథకం 9వ వార్షికోత్సవం

న్యూఢిల్లీ, అక్టోబర్ 23:పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఇవాళ ప్రాంతీయ అనుసంధాన పథకం 'ఉడాన్' (ఉడే దేశ్ కా ఆమ్ నాగరిక్) 9వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించింది. ఇందులో భాగంగా న్యూఢిల్లీలో మంత్రిత్వశాఖ కార్యదర్శి శ్రీ సమీర్ కుమార్ సిన్హా అధ్యక్షతన సాగిన ప్రధాన వేడుకలలో విమానాశ్రయాల ప్రాధికార సంస్థ (ఏఏఐ) చైర్మన్, సభ్యులు, సిబ్బంది సహా మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా శ్రీ సిన్హా మాట్లాడుతూ- జాతీయ పౌర విమానయాన విధానం కింద 2016 అక్టోబరు 21న ఉడాన్ పథకం ప్రారంభమైందని గుర్తుచేశారు. దేశంలోని సాధారణ పౌరులకు కూడా విమాన ప్రయాణాన్ని అందుబాటులోకి తేవడం లక్ష్యంగా ఈ ప్రగతిశీల పథకాన్ని ప్రభుత్వం అమలులోకి తెచ్చిందని వివరించారు. ఈ మేరకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ 2017 ఏప్రిల్ 27న సిమ్లా-ఢిల్లీ మధ్య తొలి 'ఉడాన్' విమానాన్ని ప్రారంభించడం ప్రాంతీయ విమానయాన సంధానంలో నవశకానికి నాంది పలికిందని ఆయన పేర్కొన్నారు.

ఈ పథకం కింద 15 హెలిపోర్టులు, 2 వాటర్ ఏరోడ్రోమ్‌లు సహా సహా వినియోగంలో లేని, స్వల్ప వినియోగంలోగల 93 విమానాశ్రయాలను జోడిస్తూ 649 మార్గాల్లో సేవలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో 3.23 లక్షల విమానయానాల ద్వారా 1.56 కోట్ల మందికి పైగా ప్రయాణికులకు 'ఉడాన్' సేవలు లభించాయి. ప్రాంతీయ మౌలిక సదుపాయాల కల్పనతోపాటు విమానయాన సంస్థలకు మద్దతుగా ప్రభుత్వం 'నష్టనివారణ నిధి' (వయబిలిటీ గ్యాప్ ఫండింగ్-వీజీఎఫ్) కింద రూ.4,300 కోట్లకు పైగా సహాయం అందించింది. దీంతోపాటు 'ఉడాన్' కింద విమానాశ్రయాల అభివృద్ధికి రూ.4,638 కోట్లదాకా పెట్టుబడులు పెట్టింది.

మరోవైపు ఈ దిశగా చేపట్టిన కీలక చర్యల్లో భాగంగా 'నీ ప్లేన్' కార్యకలాపాల నిర్వహణకు 2024 ఆగస్టులో సమగ్ర మార్గదర్శకాలను జారీచేసింది. అలాగే 'నీ ప్లేన్లు, హెలికాప్టర్ల కోసం ప్రత్యేక బిడ్డింగ్ రౌండ్ కింద 'ఉడాన్ 5.5' పేరిట మరో ముఖ్యమైన కార్యక్రమం కూడా చేపట్టింది. దీనికి అనుగుణంగా వివిధ తీర-ద్వీప ప్రాంతాల్లోని 30 జల విమానాశ్రయాలను అనుసంధానించే 150 మార్గాలపై ప్రాథమిక ఒప్పందాల దిశగా ఆసక్తి వ్యక్తీకరణ పత్రం (ఎల్ఓఐ) కూడా జారీచేసింది.

ఈ పథకాన్ని 2027 ఏప్రిల్ తర్వాత కూడా కొనసాగించడానికి ప్రభుత్వం నిబద్ధతతో ఉందని శ్రీ సమీర్ కుమార్ సిన్హా వెల్లడించారు. ఇందుకోసం పర్వత ప్రాంతాలు, ఈశాన్య భారతం సహా ఆకాంక్షాత్మక ప్రాంతాలతో అనుసంధానం లక్ష్యంగా దాదాపు 120 కొత్త గమ్యాల అభివృద్ధిపై దృష్టి సారిస్తూ 'ఉడాన్' చట్రాన్ని విస్తరింపజేస్తామని ఆయన ప్రకటించారు.

'ఉడాన్' కేవలం ఒక పథకానికి పరిమితం కాదని, ప్రగతిశీల మార్పులకు తోడ్పడే కార్యక్రమమని శ్రీ సిన్హా వ్యాఖ్యానించారు. దేశ ప్రగతి పయనంలో అంతర్భాగంగా విమానయానాన్ని సార్వజనీనం, సుస్థిరం చేయడంపై భారత్ నిబద్ధతకు నిదర్శనమని ఆయన అభివర్ణించారు.

జాతీయ పోలీసు అమరవీరుల స్మారకం వద్ద రక్షణ మంత్రి పుష్పాంజలి

న్యూఢిల్లీ, అక్టోబర్ 23:పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా 2025, అక్టోబర్ 21న జాతీయ పోలీసు అమరవీరుల స్మారకం వద్ద రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పుష్పాంజలి ఘటించారు. 1959లో ఇదే రోజున లదాఖ్‌లోని హాట్ స్ప్రింగ్స్ వద్ద భారీగా ఆయుధాలు ధరించిన చైనీస్ బలగాలు చేసిన మెరుపు దాడిలో 10 మంది పోలీసు వీరులు ప్రాణాలు కోల్పోయారు.

ప్రాణాలర్పించిన యోధులకు రక్షణ మంత్రి ఘన నివాళులు అర్పిస్తూ, దేశానికి సేవలందిస్తున్న పోలీసులు, పారామిలటరీ బలగాలకు కృతజ్ఞతలు తెలిపారు. సాయుధ, పోలీసు బలగాలు జాతీయ భద్రతలో కీలక పాత్ర పోషిస్తున్నాయని ఆయన అన్నారు. ఒకరు దేశాన్ని, దాని ప్రాదేశిక సమగ్రతను పరిరక్షిస్తుంటే, మరొకరు సమాజాన్ని, సామాజిక సమగ్రతను కాపాడుతున్నారన్నారు. "సైన్యం, పోలీలు వేర్వేరు వేదికల్లో పనిచేస్తున్నప్పటికీ.. వారి లక్ష్యం ఒక్కటే – అదే దేశాన్ని రక్షించడం. మనం 2047 నాటికి వికసిత్ భారత్‌ను సాధించే దిశగా ముందడుగు వేస్తున్న ఈ సమయంలో దేశం బాహ్య, అంతర్గత భద్రతను సమతూకం చేయడం గతంలో కంటే చాలా ముఖ్యం" అని ఆయన చెప్పారు.

ప్రస్తుతం ఎదురవుతున్న సవాళ్ల గురించి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. సరిహద్దుల్లో అస్థిరత ఉన్నప్పటికీ సమాజంలో కొత్త తరహా నేరాలు, ఉగ్రవాదం, సైద్ధాంతిక యుద్ధాలు పుట్టుకొస్తున్నాయన్నారు. నేరాలు మరింత వ్యవస్థీకృతంగా, కంటికి కనిపించని రూపంలో, సంక్లిష్టంగా మారుతున్నాయని, సమాజంలో అలజడిని సృష్టించడం, విశ్వాసాన్ని దెబ్బ తీయడం, దేశ స్థిరత్వానికి సవాలు విసరడమే వాటి లక్ష్యమని తెలియజేశారు.

సమాజంలో నమ్మకాన్ని కొనసాగించే నైతిక బాధ్యతను నిర్వర్తిస్తూనే.. నేరాలను నియంత్రించే అధికారిక బాధ్యతలను పోలీసులు చేపడుతున్నారని రక్షణ మంత్రి ప్రశంసించారు. "ఇప్పుడు ప్రజలు ప్రశాంతంగా నిద్రపోతున్నారంటే దానికి కారణం.. నిరంతరం అప్రమత్తంగా ఉండే సాయుధ బలగాలు, పోలీసులపై వారికున్న నమ్మకమే. ఈ విశ్వాసమే మన దేశ స్థిరత్వానికి పునాది" అని ఆయన అన్నారు.

దీర్ఘ కాలంగా దేశ అంతర్గత భద్రతలో ప్రధాన సవాలుగా నిలిచిన నక్సలిజం గురించి చర్చిస్తూ.. పోలీసు, సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్, స్థానిక అధికారుల సమష్టి, వ్యవస్థీకృత చర్యలు సమన్య తీవ్రత పెరగకుండా చూశాయని, వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల ప్రజలు ఊపిరి పీల్చుకునేలా చేశాయని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. వచ్చే ఏడాది మార్చి నాటికి ఈ సమస్య పూర్తిగా సమసిపోతుందనే విశ్వాసం వ్యక్తం చేశారు. "ఈ ఏడాది అనేక మంది నక్సలైట్లను అంతం చేశాం. ఒకప్పుడు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆయుధాలు చేపట్టినవారు ఇప్పుడు లొంగిపోయి అభివృద్ధిని కోరుకుంటూ తీవ్రవాదాన్ని వదలిపెడుతున్నారని చెప్పారు. తీవ్రవాద ప్రభావిత జిల్లాల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. ఒకప్పుడు నక్సలైట్ కేంద్రాలుగా ఉన్న ప్రాంతాలు ఇప్పుడు విద్యా కేంద్రాలుగా మారుతున్నాయి. ఒకప్పుడు నక్సలైట్ల ప్రాబల్యం ఎక్కువగా ఉన్న ప్రాంతాలు ఇప్పుడు ప్రగతికి కారిడార్లుగా మారుతున్నాయి. మన పోలీసు, భద్రతా దళాలు ఈ విజయంలో తమదైన పాత్రను పోషించాయి" అని అన్నారు.

జాతీయ భద్రతను అందించాలన్న ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వ నిబద్ధతను, దీని సాధించడంలో పోలీసు బలగాలు చేస్తున్న కృషిని పునరుద్ఘాటించారు. "దీర్ఘకాలంగా.. పోలీసులు అందిస్తున్న సహకారాన్ని మనం.. అంటే దేశం పూర్తిగా గుర్తించలేదు. మన పోలీసు బలగాల త్యాగాలను గౌరవించడానికి పీఎం మోదీ సారథ్యంలోని ప్రభుత్వం.. 2018లో జాతీయ పోలీసు స్మారకాన్ని నిర్మించింది. దీనికి అదనంగా.. పోలీసులకు అత్యాధునిక ఆయుధాలు, మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నాం. ఇప్పుడు పోలీసుల వద్ద పర్యవేక్షణ వ్యవస్థలు, డ్రోన్లు, ఫోరెన్సిక్ ప్రయోగశాలలు, డిజిటల్ పోలీసింగ్ లాంటి అత్యాధునిక సౌకర్యాలున్నాయి. పోలీసు బలగాలను ఆధునికీకరించడానికి సరిపడినన్ని వనరులను కూడా రాష్ట్రాలకు అందిస్తున్నాం'' అని ఆయన వివరించారు. వనరులను పూర్తిగా ఉపయోగించుకోవాలని పిలుపునిస్తూ.. భద్రతా వ్యవస్థల సమన్వయం, ఏకీకరణ ద్వారానే లక్ష్యాన్ని సాధించగలమని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు.

సమాజం, పోలీసులు ఒకరిపై ఒకరు సమాన స్థాయిలో ఆధారపడి ఉన్నారంటూనే, భద్రతా వ్యవస్థ మరింత విస్తృతంగా, అప్రమత్తంగా ఉండాలంటే.. ఇద్దరి మధ్యా సమతుల బంధం అవసరమని స్పష్టం చేశారు. "పౌరులు భాగస్వాములుగా పనిచేసి, చట్టాన్ని గౌరవించినప్పుడు మాత్రమే పోలీసు వ్యవస్థ సమర్థవంతంగా పనిచేయగలదు. పరస్పర అవగాహన, బాధ్యత అనే మూలాలపై ఆధారపడి సమాజం, పోలీసుల మధ్య అనుబంధం ఏర్పడినప్పుడు రెండూ వృద్ధి చెందుతాయి" అని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో భాగంగా కేంద్ర సాయుధ పోలీసు బలగాలు (సీఏపీఎఫ్), ఢిల్లీ పోలీసులు సంయుక్తంగా కవాతు నిర్వహించారు. కేంద్ర హోం వ్యవహారాల శాఖ సహాయ మంత్రి శ్రీ బండి సంజయ్ కుమార్, హోం శాఖ కార్యదర్శి శ్రీ గోవింద్ మోహన్, ఇంటిలిజెన్స్ బ్యూరో డైరెక్టర్ శ్రీ తపన్ డేకా, బీఎస్ఎఫ్ డీజీ శ్రీ దల్జీత్ సింగ్ చౌధరి, సీఏపీఎఫ్‌లకు చెందిన ఇతర ఉన్నతాధికారులు, పదవీ విరమణ చేసిన డీజీలు, పోలీసు వర్గాలకు చెందిన అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రపంచ తయారీ, ఎగుమతి కేంద్రంగా భారత్‌ను మార్చేందుకు తీసుకుంటున్న చర్యలను ప్రశంసించిన ఉపరాష్ట్రపతి

న్యూఢిల్లీ, అక్టోబర్ 23:కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల మంత్రి శ్రీ పీయూష్ గోయల్.. మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారులతో కలిసి ఈ రోజు పార్లమెంట్ భవనంలో భారత ఉపరాష్ట్రపతి శ్రీ సీ.పీ. రాధాకృష్ణన్‌ను కలిశారు.

వాణిజ్యం, పరిశ్రమల మంత్రిత్వ శాఖ కీలక కార్యక్రమాలను ఉపరాష్ట్రపతికి వివరించారు. వ్యాపార కార్యకలాపాలను సులభతరం చేయడం, భారత తయారీ సామర్థ్యాలను బలోపేతం చేయడం, దేశాన్ని ప్రపంచ ఎగుమతి కేంద్రంగా నిలబెటాలనే లక్ష్యంతో చేపట్టిన వివిధ ప్రభుత్వ కార్యక్రమాలతో పాటు తయారీ, విదేశీ వాణిజ్యంలో ప్రస్తుత తీరుతెన్నులను ఈ సందర్భంగా చర్చించారు.

భారత్‌లో తయారీ, పీఎల్ఐ పథకం, పీఎం గతి శక్తి మాస్టర్ ప్లాన్, అంకుర భారత్, జాతీయ తయారీ మిషన్, ఎఫ్‌టీఏలు, ఒక జిల్లా – ఒక ఉత్పత్తి, పారిశ్రామిక కారిడార్లు, సెజ్‌లు, మేధో సంపత్తి హక్కుల రక్షణ వంటి వాటిపై సమావేశంలో చర్చించారు.

భారతదేశాన్ని తయారీ, ఎగుమతులకు ప్రపంచ కేంద్రంగా మార్చేందుకు మంత్రిత్వ శాఖ చేస్తోన్న కృషిని, నూతన మార్కెట్లలోకి ప్రవేశించేందుకు చేపడుతున్న కార్యక్రమాలను ఉపరాష్ట్రపతి ప్రశంసించారు. వికసిత్ భారత్ దార్శనికతను సాధించేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయటానికి ఉన్న ప్రాముఖ్యతను ఆయన ప్రధానంగా ప్రస్తావించారు.

పరీక్షా కేంద్రం ఏర్పాటు చేయాలి..

మక్తల్, అక్టోబర్ 23: మక్తల్ పట్టణంలో డిగ్రీ పరీక్షల కేంద్రం ఏర్పాటు చేయాలని పాలమూరు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్, ఎగ్జామినేషన్ కంట్రోలర్‌లకు ఏబీవీపీ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ రోజు పాలమూరు యూనివర్సిటీ మక్తల్ పట్టణంలో డిగ్రీ పరీక్షా కేంద్రం ఏర్పాటు ఆవశ్యకతను వీసీ, రిజిస్ట్రార్, ఎగ్జామినేషన్ కంట్రోలర్‌లను కలుసుకుని వివరించి వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ.. మక్తల్ పట్టణంలో ప్రైవేట్, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఉన్నప్పటికీ ఎగ్జామినేషన్‌కు మాత్రమే నారాయణపేట సెంటర్ ఉండడంతో విద్యార్థులు దూర ప్రయాణం చేసి పరీక్ష రాయల్సివస్తుందన్నారు. ఈ విషయం పై గతంలో కూడా వినతి అందచేయడం జరిగిందని వీసీ దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. అయితే మక్తల్ పరిసర గ్రామాల నుండి వచ్చే విద్యార్థులకు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు. క్రిష్ణ, కున్సి, చెంగుట, అనుగొండ తదితర గ్రామాల నుండి వచ్చే విద్యార్థులకు సాయంత్రం బస్సు కూడా లేక పోవడంతో వారి గ్రామాలకు వెళ్ళడానికి తీవ్రంగా సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు.

ఈ సమస్యలనిటినీ పాలమూరు యూనివర్సిటి వీసీ దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. అందుకు వారు సానుకూలంగా స్పందించి మక్తల్‌లో డిగ్రీ ఎగ్జామినేషన్ సెంటర్ ఏర్పాటు చేసే విధంగా కృషి చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందని ఏబీవీపీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నరేష్ తేజ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వినయ్ కుమార్, నాయకులు క్రిష్ణ, రవి తేజ, వినయ్ కుమార్, భారత్, ప్రశాంత్, అనిల్, సందీప్, భాను తదితరులు పాల్గొన్నారు..

కీమోథెరపీ యూనిట్ ప్రారంభం..

గోదావరిఖని, అక్టోబర్ 23: పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ప్రభుత్వ హాస్పటల్లో క్యాన్సర్ రోగుల కోసం కీమోథెరపీ చికిత్స యూనిట్‌ను గురువారం ప్రారంభించారు. హైదరాబాద్ ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రి సూచనల మేరకు క్యాన్సర్ బాధితులకు కీమోథెరపీ అందించేలా ఈ ప్రత్యేక యూనిట్‌ను ఏర్పాటు చేసినట్లు వైద్యాధికారులు తెలిపారు.

ఎంఎన్‌జే ఆసుపత్రి వైద్య నిపుణులు ఇచ్చిన ప్రోటోకాల్, షెడ్యూల్ ప్రకారం రోగులు చికిత్స పొందనున్నారు. రోగులు ప్రభుత్వ ఆసుపత్రికి విచ్చేసినప్పుడు మొదట వారి వైటల్ రిపోర్టులు, ల్యాబ్ పరీక్షలు పరిశీలించబడతాయి. అన్ని రిపోర్టులు సాధారణంగా ఉన్నట్లయితే, హాస్పిటల్ వైద్య బృందం ఎంఎన్‌జే ఆసుపత్రి సూచనల ఆధారంగా కీమోథెరపీని ప్రారంభిస్తుంది. రోగి వైటల్స్ లేదా పరీక్షల్లో ఏవైనా అసాధారణతలు ఉంటే, వారిని మళ్లీ ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రికి రిఫర్ చేస్తారు. ఈ యూనిట్ ప్రారంభం వల్ల గోదావరిఖని, పరిసర ప్రాంతాల క్యాన్సర్ బాధితులు ఇకపై హైదరాబాద్ ఎంఎన్‌జే ఆసుపత్రికి వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే చికిత్స పొందే అవకాశం లభించనుంది.

ఈ కీమోథెరపీ యూనిట్ ను డాక్టర్ ఫర్హిద్, డాక్టర్ ఇర్ఫాన్ ఆధ్వర్యంలో నడుపుతున్నారు. జిల్లా కలెక్టర్, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్సింగ్ రాజ్ ఠాగూర్, మరియు ప్రభుత్వ హాస్పటల్ సూపరింటెండెంట్ సహకారంతో, ఈ యూనిట్ ప్రారంభమైందని అధికారులు తెలిపారు. కీమోథెరపీ చికిత్సలు పూర్తిగా వైద్యుల పర్యవేక్షణలో సురక్షితంగా నిర్వహించబడుతున్నాయని ఆసుపత్రి వర్గాలు స్పష్టం చేశారు.

సుస్థిర ఇంధన కేంద్రం ఏర్పాటుకు 'కోల్ ఇండియా..ఐఐటీ-మద్రాస్' మధ్య అవగాహన ఒప్పందం

న్యూఢిల్లీ, అక్టోబర్ 23:ఐఐటీ–మద్రాస్ ప్రాంగణంలో "సుస్థిర ఇంధన కేంద్రం ఏర్పాటుకు 'కోల్ ఇండియా లిమిటెడ్' (సీఐఎల్), ఐఐటీ–మద్రాస్ మధ్య బుధవారం అవగాహన ఒప్పందం ఖరారైంది. 'సీఐఎల్' చైర్మన్ శ్రీ పి.ఎం.ప్రసాద్ సహా రెండు సంస్థల సీనియర్ అధికారుల సమక్షంలో 'సీఐఎల్' డైరెక్టర్ (టెక్నికల్) శ్రీ అచ్యుత్ ఘటక్, ఐఐటీ–మద్రాస్ డైరెక్టర్ శ్రీ వి.కామకోటి ఈ ఒప్పందంపై సంతకం చేశారు.

సుస్థిర ఇంధన సాంకేతికతలపై అత్యాధునిక పరిశోధన–ఆవిష్కరణలు సహా సామర్థ్య వికాస కార్యక్రమాల కూడలిగా ఈ కేంద్రం ఉపయోగపడుతుంది. 'సీఐఎల్' నుంచి నిధుల తోడ్పాటుతో నిర్దేశిత వ్యూహాత్మక వైవిధ్యీకరణ లక్ష్యాలకు తగినట్లుగా ఈ కేంద్రం పనిచేస్తుంది. ఈ మేరకు భిన్న లక్ష్యాల కోసం బొగ్గు గనుల వినియోగం, స్వల్ప కర్బన ఉద్గార సాంకేతికతల ఆవిష్కరణ, భారత భవిష్యత్ కాలుష్య రహిత ఇంధనంలో విలువైన ముడిసరకుగా బొగ్గు నద్వినియోగానికి మార్గాన్వేషణపై ఇది ప్రధానంగా దృష్టి సారిస్తుంది. నికర శూన్య ఉద్గారాల దిశగా 2070 నాటికి దేశం నిర్దేశించుకున్న లక్ష్యాల సాధనతోపాటు స్వదేశీ పరిశోధన–ఆవిష్కరణలు, సాంకేతికతల రూపకల్పన ద్వారా భారత ఇంధన రంగ రూపాంతరీకరణకు సారథ్యంలో సంయుక్త నిబద్ధతను ఈ భాగస్వామ్యం స్పష్టం చేస్తుంది.

ఈ సందర్భంగా 'సీఐఎల్' చైర్మన్ శ్రీ పి.ఎం.ప్రసాద్ మాట్లాడుతూ–దేశానికి ఇంధన ప్రదాత పాత్ర నుంచి భారత కాలుష్య రహిత ఇంధన రూపాంతరీకరణకు కీలక దోహదకారిగా కోల్ ఇండియా రూపొందుతున్నదని పేర్కొన్నారు. "సుస్థిర వృద్ధి దిశగా కోల్ ఇండియా వయసంలో చరిత్రాత్మక ముందడుగుకు ఈ అవగాహన ఒప్పందం ఒక సూచిక. ఇందులో భాగంగా ఐఐటీ–మద్రాస్ సహకారంతో ఇంధన భద్రత, కర్బన ఉద్గారాల తగ్గింపు, సామాజిక–ఆర్థిక పురోగతికి భరోసా ఇవ్వగల స్వదేశీ పరిష్కారాన్వేషణ కోల్ ఇండియా భవిష్యత్ లక్ష్యాలు" అని ఆయన ప్రకటించారు.

అనంతరం ఐఐటీ–మద్రాస్ డైరెక్టర్ వి.కామకోటి ప్రసంగిస్తూ–స్వల్ప కర్బన ఉద్గార ఆర్థిక వ్యవస్థగా భారత్ రూపాంతరీకరణ వైపు తమ సంస్థ పురోగమనానికి పారిశ్రామిక–విద్యా రంగాల సహకారం ఒక మూల స్తంభమని పేర్కొన్నారు. "తమ లక్ష్య సాధనలో మా నిబద్ధతను కోల్ ఇండియాతో భాగస్వామ్యం ప్రతిబింబిస్తుంది. ఆ మేరకు భారత సుస్థిర ఇంధన భవిష్యత్తుకు తోడ్పడే ప్రభావశీల, ఆచరణాత్మక పరిష్కారాల రూపకల్పనకు కృతనిశ్చయంతో ఉన్నాం" అని ఆయన స్పష్టం చేశారు.

ఈ కేంద్రం 'పీహెచ్‌డీ, పోస్ట్ డాక్టరల్, ఇంటర్న్ షిప్' వంటి కార్యక్రమాల ద్వారా దేశానికి అవసరమైన మానవ మూలధన సంపత్తిని కూడా సమకూరుస్తుంది. ఆ మేరకు భారత కాలుష్య రహిత ఇంధన రూపాంతరీకరణకు సారథ్యం వహించగల భావితరం పరిశోధకులను, ఇంజినీర్లను అందిస్తుంది.

హెచ్ఎంపై ఆగ్రహం

కొండపాక, అక్టోబర్ 23: దుద్దెడ జిల్లా పరిషత్ హైస్కూల్లో మధ్యాహ్న భోజనాన్ని జిల్లా కలెక్టర్ హైమావతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెనూ ప్రకారం వంట చేయకపోవడంపై హెచ్ఎం లక్ష్మిపై ఆగ్రహం వ్యక్తం చేసిన జిల్లా కలెక్టర్ సాకులు చెప్పవద్దంటూ హెచ్చరించారు. అనంతరం ఆరోగ్య ఉప కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ హైమావతి ఏఎన్ఎం స్వరూపురాణి గైర్హాజరు పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. రిజిస్టార్ లో ఆబ్సెంట్ వేసిన జిల్లా కలెక్టర్ విధులు సక్రమంగా నిర్వహించాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు.

గురు చరణ్ యాత్రతో అనుసంధానమై పవిత్ర 'జోర్ సాహిబ్' దర్శనం చేసుకోవాలని ప్రజలను కోరిన ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, అక్టోబర్ 23:ఈ రోజు గురు చరణ్ యాత్ర సందర్భంగా శ్రీ గురు గోవింద్ సింగ్ జీ, మాతా సాహిబ్ కౌర్ జీల అద్భుత బోధనలు, ఆధ్యాత్మిక వారసత్వాన్ని గుర్తుచేసుకుంటూ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

ముఖ్యంగా యాత్రా మార్గంలో నివసించే పౌరులు ఈ ఆధ్యాత్మిక యాత్రలో పాల్గొని పవిత్రమైన 'జోర్ సాహిబ్' దర్శనం చేసుకోవాలని ఆయన కోరారు.

'ఎక్స్' వేదికగా కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పురీ చేసిన పోస్టులకు ప్రతిస్పందిస్తూ శ్రీ మోదీ ఇలా పేర్కొన్నారు:

"గురు చరణ్ యాత్ర సందర్భంగా శ్రీ గురు గోవింద్ సింగ్ జీ, మాతా సాహిబ్ కౌర్ జీల గొప్ప ఆదర్శాలతో మన అనుబంధాన్ని మరింతగా పెంపొందించుకోవాలని కోరుకుంటున్నాను. ఈ యాత్ర సాగే ప్రాంతాల ప్రజలంతా యాత్రలో భాగస్వాములై పవిత్రమైన 'జోర్ సాహిబ్' దర్శనం చేసుకోవాలని నేను విజ్ఞప్తి చేస్తున్నాను."

ప్రజాస్వామ్య ఉమ్మడి విలువలతో పాటు ప్రపంచ శాంతికి కట్టుబడి ఉందామంటూ పునరుద్ఘాటన

న్యూఢిల్లీ, అక్టోబర్ 23:దీపావళికి స్వయంగా ఫోన్ చేసి హృదయపూర్వక శుభాకాంక్షలను చెప్పినందుకు అమెరికా అధ్యక్షుడు గౌరవ డొనాల్డ్ ట్రంప్‌నకు ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు మనసారా కృతజ్ఞతలు తెలియజేశారు.

భారత్–అమెరికా భాగస్వామ్యం చాలాకాలంగా బలోపేతం అవుతోందని ప్రధానమంత్రి స్పష్టంచేశారు. ఉగ్రవాదంతో పోరాటంలోనూ, అంతర్జాతీయ సహకారాన్ని ప్రోత్సహించడంలోనూ భారత్ నిబద్ధత తిరుగులేనిదని కూడా పునరుద్ఘాటించారు.

'ఎక్స్'లో ప్రధానమంత్రి శ్రీ మోదీ ఒక సందేశాన్ని పొందుపరుస్తూ, ఇలా పేర్కొన్నారు:

"అధ్యక్షుడు శ్రీ ట్రంప్ గారూ... ఫోన్ చేసినందుకూ, దీపావళి శుభాకాంక్షలు చెప్పినందుకు ధన్యవాదాలు. ఈ దీపాల పండగ సందర్భంగా.. మన రెండు ప్రజాస్వామ్యదేశాలూ ప్రపంచంలో ఆశాజ్యోతిని వెలిగించేందుకూ, ఏ రూపంలో ఉన్నా ఉగ్రవాదంపై జరిగే పోరాటంలో ఇరువురూ ఏకతాటిపై నిలబడాలనీ నేను కోరుకుంటున్నాను."

తన కారుకు ఇంధనం నింపనందుకు.. పెట్రోల్ బంకు సిబ్బందిపై అధికారి దాడి

జైపూర్, అక్టోబర్ 23: తన కారుకు వెంటనే ఇంధనం నింపనందుకు సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ ఆగ్రహించాడు. పెట్రోల్ బంకు సిబ్బంది చెంపపై కొట్టాడు. ఈ నేపథ్యంలో ఆ అధికారి, పెట్రోల్ బంకు సిబ్బంది మధ్య ఘర్షణ జరిగింది. రాజస్థాన్‌లోని భిల్వారాలో ఈ సంఘటన జరిగింది. ప్రతాప్‌గఢ్ సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ ఛోటు లాల్ శర్మ, మంగళవారం జస్వంత్‌పురా ప్రాంతంలోని పెట్రోల్ బంక్‌కు తన కారులో చేరుకున్నాడు. క్యూలో ఉన్న మిగతా వాహనాల కంటే ముందుగా తన కారుకు ఇంధనం నింపకపోవడంపై ఆయన ఆగ్రహించాడు. ఒక సిబ్బంది వద్దకు వెళ్లి చెంపపై కొట్టాడు. దీంతో పెట్రోల్ బంకు సిబ్బంది ఆయనపై చేయి చేసుకున్నారు.

కాగా, కారులో ఉన్న ఎస్డీఎం భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. పెట్రోల్ బంకులోని ఒక సిబ్బంది తనను చూసి కన్నుగీటి అసభ్యకరమైన వ్యాఖ్య చేయడంతో ఈ గొడవ జరిగినట్లు ఆరోపించింది. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు, దీపక్ మాలి, ప్రభు లాల్ కుమావత్, రాజా శర్మ అనే ముగ్గురు బంకు సిబ్బందిని అరెస్ట్ చేశారు.

మరోవైపు ఎస్డీఎం తొలుత అకారణంగా పెట్రోల్ బంకు సిబ్బంది చెంపపై కొట్టిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఆయన భార్య ఫిర్యాదుతో కేవలం బంకు సిబ్బందిని అరెస్ట్ చేయడంపై విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో పోలీసులు దిగి వచ్చారు. ఇరు వర్గాల ఫిర్యాదులపై దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

మోటార్ సైకిల్‌ను ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి..

జన్నారం, అక్టోబర్ 23: బొలోరో వాహనం మోటార్ సైకిల్‌ను ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు ఆదివాసీలు రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన ఇది. సంఘటన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మోర్రిగూడ గ్రామసమీపాన ప్రధాన రహదారిపై ఈ రోజు మధ్యాహ్నం బోలోరో వాహనం మోటార్ సైకిల్‌ను ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు ఆదివాసీలు అక్కడికక్కడే మృతి చెందారు. టీఎస్ 16యూఎ 6938 నెంబరు గల బొలోరో వాహనం, టీఎస్ 01ఈపీ 6302 నంబరు గల మోటార్ సైకిల్ ను ఢీ కొట్టింది. బొలోరో వాహనం పల్టీలు కొట్టి పక్కనే ఉన్న పంట పొలంలో పడింది.

ఈ ప్రమాదంలో మోటార్ సైకిల్ పై ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతి చెందారు. మృతుల ముఖాలు నుజ్జునుజ్జయ్యాయి. మృతులు ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూరు మండలంలోని ఘన్పూర్ కు చెందిన దొసంద్ల అంకన్న(55), నాగపూర్ కు చెందిన సీడం మోతిరాం (45)గా గుర్తించారు. బొలోరో వాహనం డ్రైవర్ షేక్ అల్మాస్‌కు ఎలాంటి దెబ్బలు తగలలేదు. సంఘటన స్థలాన్ని లక్షెట్టిపేట సీఐ రమణమూర్తి, జన్నారం ఎస్సై గొల్లపల్లి అనూష సందర్శించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం లక్షెటిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు.

మెగా జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలి : ఎస్పీ నరసింహ

నల్గొండ, అక్టోబర్ 23:: హుజూర్‌నగర్ పట్టణంలో ఈ నెల 25న ప్రభుత్వ ఆధ్వర్యంలో 250 కంపెనీలతో నిర్వహించే మెగా జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ అన్నారు. జాబ్ మేళాకు సంబంధించి పోలీస్ బందోబస్తు, భద్రత ఏర్పాట్లను గురువారం ఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 20 వేలకు పైగా యువతీ యువకులు హాజరయ్యే అవకాశం ఉన్నందున ఎక్కడా అవాంఛనీయ సంఘటన జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిపారు. యువత నైపుణ్యం ఉన్న రంగం వైపు వెళ్లి విజయం సాధించాలని తెలిపారు. ఎస్పీ వెంట అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, డీఎస్పీలు ప్రసన్నకుమార్, రవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు చరమందరాజు, రామకృష్ణారెడ్డి, ప్రతాప్ లింగం, సర్కిల్ ఎస్ఐలు మోహన్ బాబు, నరేశ్, రవీందర్, బాబు, కోటేశ్ ఉన్నారు.

విద్యార్థులకు 'దివిస్' స్కూల్ బ్యాగ్స్, నోట్ బుక్స్ పంపిణీ

నల్గొండ, అక్టోబర్ 23: రామన్నపేట మండలంలోని వెల్లంకి గ్రామం జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు 170 మందికి, అలాగే మండల పరిషత్ పాఠశాల విద్యార్థులు 160 మందికి దివిస్ లేబరేటరీస్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద రూ.2 లక్షల విలువ గల నోట్ బుక్స్, స్కూల్ బ్యాగులను పంపిణీ చేసింది. గురువారం దివిస్ లేబరేటరీ సిఎస్ఆర్ ఇన్‌చార్జి గోపి, వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బ్యాగ్స్, బుక్స్ పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ వెల్లంకి హెచ్ఎం టి.సురేందర్ రెడ్డి, ఎంపీపీఎస్ హెచ్ఎం పి.మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రక్షణ విభాగాల్లో స్వచ్ఛతా కార్యక్రమాల్ని నిర్వహిస్తున్న సైనిక వ్యవహారాల విభాగం

న్యూఢిల్లీ, అక్టోబర్ 23:రక్షణ మంత్రిత్వ శాఖ ఈ నెల 2వ తేదీ నుంచి 31వ తేదీ వరకు స్పెషల్ క్యాంపెయిన్ 5.0ను నిర్వహిస్తోంది. దీనిలో సాయుధ దళాలతో పాటు దేశవ్యాప్తంగా అన్ని రక్షణ విభాగాలూ ఉత్సాహంగా పాల్గొంటున్నాయి. ఈ ప్రచార ఉద్యమంలో మొదటి రెండు వారాల్లోనూ మొత్తం 1,39,484 ఫైళ్లను సమీక్షించి, 1,443 స్థలాలను పరిశుభ్ర పరిచారు. 157 నియమాలను సమీక్షించి, సులభతరం చేశారు. తుక్కు అమ్మకంతో ఇంతవరకు రూ.10.89 కోట్లు సమకూరాయి.

కిందటి నెలలో సన్నాహక దశను చేపట్టిన సందర్భంగా ప్రచార ఉద్యమానికి సంబంధించిన వివిధ అంశాల్లో ఆచరణసాధ్య లక్ష్యాల్ని నిర్దేశించారు. ప్రస్తుత అమలు దశలో, పని ప్రదేశాల్ని అద్దంలా ఉండేలా తీర్చిదిద్దడం, వినియోగిస్తున్న ప్రదేశాలను ఉత్తమంగా ఉపయోగించుకోవడం, తుక్కును వదిలించుకోవడం, పాత రికార్డులను ఏరివేయడంతో పాటు ఖాళీ ప

కుష్టు వ్యాధి వ్యాప్తి నివారణపై అవగాహన పెంచుకోవాలి : డాక్టర్ మౌనికరెడ్డి

నల్గొండ, అక్టోబర్ 23:కుష్టు వ్యాధి వ్యాప్తి నివారణపై అవగాహన పెంచుకోవాలని బీబీనగర్ పీహెచ్‌సీ డాక్టర్ మౌనికరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల కళాశాలలలో జిల్లా నూక్లీయస్ టీమ్ ఆధ్వర్యంలో కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించి స్క్రీనింగ్ నిర్వహించారు. కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్నవారెవరైనా బహుళ ఔషధ చికిత్సను ఆరు లేదా పన్నెండు నెలల పాటు తీసుకుంటే వ్యాధి పూర్తిగా నయం అవుతుందన్నారు. దీంతో అంగ వైకల్యం రాకుండా నివారించవచ్చన్నారు. ఈ మందులు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందించబడుతాయన్నారు. వ్యాధి అనుమానిత లక్షణాలు ఉన్నవారు స్థానిక వైద్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. కుష్టు వ్యాధి సంపూర్ణ నిర్మూలనకు వ్యాధిపై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలని విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల హెడ్ మాస్టర్లు మాధవి, రూప, మెడికల్ ఆఫీసర్లు రాములు, అనిత, మాధవి, రమేశ్ నాయక్, ఎంపీహెచ్‌ఏ, ఆశాలు ఆరోగ్యమ్మ, వసంత, గంగాలక్ష్మి, ఇందిర, అనురాధ, లావణ్య పాల్గొన్నారు.

ఎయిమ్స్.. డైరెక్టర్‌గా అమితా అగర్వాల్ బాధ్యతల స్వీకరణ

బీబీనగర్, అక్టోబర్ 23 : బీబీనగర్ ఎయిమ్స్? డైరెక్టర్‌గా అమితా అగర్వాల్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ డైరెక్టర్‌గా పనిచేసిన వికాస్ భాటియా బదిలీపై వెళ్లగా అమె పూర్తిస్థాయి డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. అమితా అగర్వాల్‌కు ఎయిమ్స్? అధ్యాపకులు, సిబ్బంది ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎయిమ్స్ అభివృద్ధితో పాటు విద్య, ఆరోగ్య సంరక్షణలో సంస్థాగత వృద్ధి సాధించేందుకు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం ఎయిమ్స్? వైద్యులతో ఆమె సమావేశం నిర్వహించారు.

జెనీవాలో జరిగిన యూఎన్సీటీఏడీ 16వ సదస్సులో పాల్గొన్న కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్

న్యూఢిల్లీ, అక్టోబర్ 23:జెనీవాలో జరిగిన ఐక్య రాజ్య సమితి వాణిజ్యం, అభివృద్ధి సమావేశం (యునైటెడ్ నేషన్స్ కాన్ఫరెన్స్ ఆన్ ట్రేడ్ అండ్ డెవలప్‌మెంట్ –యూఎన్సీటీఏడీ) 16 వ సదస్సులో భారత ప్రతినిధివర్గానికి కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి శ్రీ పీయూష్ గోయల్ నాయకత్వం వహించారు. ఈ సదస్సులో ఆయన భారత జాతీయ ప్రకటనను చదివి వినిపించారు. కీలక చర్చలలో పాల్గొన్నారు. 1964లో ఏర్పాటయిన యూఎన్సీటీఏడీ వాణిజ్యం, పెట్టుబడి, స్థిరమైన అభివృద్ధి విధానాల ద్వారా అభివృద్ధి చెందుతున్న దేశాలను ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఏకీకృతం చేయడాన్ని ప్రోత్సహించడంలో కీలక పాత్ర పోషిస్తోంది.

సదస్సులో శ్రీ పీయూష్ గోయల్ ప్రసంగిస్తూ, ప్రపంచంలోని మొదటి ఐదు ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా భారత్ ఆవిర్భవించిందని చెప్పారు. గత మూడు సంవత్సరాలుగా సగటున 7% కంటే ఎక్కువ వార్షిక వృద్ధితో భారత్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉందని అన్నారు. ప్రతి ఎనిమిది సంవత్సరాలకు భారత్ తన ఆర్థిక వ్యవస్థను రెట్టింపు చేసిందని, గత దశాబ్దంలో లక్షలాదిమంది ప్రజలను పేదరికం నుంచి బయటకు తెచ్చిందని శ్రీ గోయల్ తెలిపారు. వారంతా ఇప్పుడు కొత్త మధ్యతరగతి మారి ఆదాయాలు, డిమాండ్ పెరుగుదలకు దోహదపడుతున్నారని పేర్కొన్నారు.

భారత సుస్థిర నాయకత్వాన్ని ప్రస్తావిస్తూ, భారత స్థాపిత విద్యుత్ సామర్థ్యంలో సగం పునరుత్పాదక ఇంధనాల నుంచి వస్తుందని, స్వచ్ఛ ఇంధనం ప్రస్తుతం 250 గిగా వాట్ల వద్ద ఉందని, 2030 నాటికి 500 గిగా వాట్లను లక్ష్యంగా పెట్టుకుందని వివరించారు. వాతావరణ మార్పుల ప్రభావాలకు వ్యతిరేకంగా కూడా భారత్ చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ప్రపంచ జనాభాలో భారత్ 17 శాతానికి ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ ప్రపంచ ఉద్గారాల్లో కేవలం 3.5 శాతం మాత్రమే వెలువరిస్తోందని ఆయన పేర్కొన్నారు. తక్కువ వ్యయంతో, దీర్ఘకాలిక ఆర్థిక సహాయం (వి100 బిలియన్), సాంకేతిక పరిజ్ఞాన బదిలీ విషయంలో అభివృద్ధి చెందిన దేశాలు పారిస్ ఒప్పందంలో చేసిన వాగ్దానాలను ఇప్పటికీ పూర్తిగా నెరవేర్చలేదని ఆయన గుర్తుచేశారు.

పర్యావరణ కారణాలను చూపించి బాధ్యతలను మోపడం లేదా వాణిజ్య అడ్డంకులను సృష్టించడం వంటి చర్యలను ఆయన ఖండించారు. సుస్థిరమైన అభివృద్ధి కోసం ప్రత్యేకమైన దృక్పథం అవసరమని ఇందుకోసం దేశాల పరిస్థితులకు అనుగుణంగా అమలు చేయగల పరిష్కారాలు అవసరమని అన్నారు. వివత్తుల నిరోధక మౌలిక సదుపాయాల కూటమి (కొయెలేషన్ ఫర్ డిజాస్టర్ రిసీలియెంట్‌స్ట్రక్చర్), అంతర్జాతీయ సౌర కూటమి (ఇంటర్నేషనల్ సోలార్ అలయెన్స్), గ్లోబల్ జీవ ఇంధనాల కూటమి (గ్లోబల్ బయోఫ్యూయెల్స్ అలయెన్స్) వంటి అంతర్జాతీయ సంస్థలు ప్రపంచవ్యాప్తంగా భాగస్వామ్యాలను పెంపొందిస్తున్నాయని తెలిపారు.

వాస్తవ పరిష్కారాల కోసం వర్ధమాన దేశాల మధ్య సహకారం అవసరమని శ్రీ పీయూష్ గోయల్ పిలుపునిచ్చారు. ముఖ్యంగా అత్యవసర ఖనిజాల లభ్యత, ఎరువుల ఉత్పత్తి, సరఫరా శ్రేణుల నిర్వహణ వంటి అంశాలలో సహకారం ప్రాముఖ్యతను వివరించారు. భారతదేశం డిజిటల్ మౌలిక సదుపాయాల ద్వారా భారత్ కోట్లాది మందికి సాధికారత కల్పిస్తూ సాంకేతిక అంతరాన్ని తగ్గిస్తోందని చెప్పారు. దేశంలో వంద కోట్లకు పైగా ఇంటర్నెట్ వినియోగదారులు ఉన్నారని, ప్రపంచవ్యాప్తంగా చాట్ జీపీటీ వినియోగదారుల సంఖ్యలో భారత్ రెండో స్థానంలో ఉందని పేర్కొన్నారు. 28.5 సంవత్సరాల సగటు వయసు కలిగిన యువ జనాభా, ప్రజాస్వామ్యం, చట్టబద్ధమైన పాలన భారత్ అభివృద్ధికి చోదకశక్తిగా ఉన్నాయని వివరించారు.

భారతదేశంలో నమ్మిళిత అభివృద్ధికి 14% పారిశ్రామికవేత్తలు, లక్షలాది ఉద్యోగాలను సృష్టించి, మద్దతిస్తున్న ఎంఎస్ఎంఈలు ఉదాహరణ అని మంత్రి పేర్కొన్నారు. సేవల రంగం జీడీపీకి 55% దోహదం చేస్తోందని, ఇది దశాబ్ద కాలంగా రెండంకెల ఎగుమతి వృద్ధిని కనబరిచిందని, దీని ద్వారా సమాన అవకాశాలున్న ఉద్యోగ కల్పన సాధ్యమైందని చెప్పారు. భాగస్వామ్య దేశాల మధ్య పోటీని, ప్రపంచ పరిధిని పెంచడానికి భారత్ పాత్రను బలోపేతం చేస్తోందని ఆయన పేర్కొన్నారు.

ప్రపంచ స్థాయిలో ఉన్న కీలక సవాళ్లను కూడా శ్రీ గోయల్ ప్రస్తావించారు. ఇవి బహుళపాక్షిక సంస్థలపై నమ్మకాన్ని, నియమాధారిత వాణిజ్య వ్యవస్థపై విశ్వాసాన్ని దెబ్బతీస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ సవాళ్లలో మార్కెట్‌కు విరుద్ధమైన విధానాలు, సుంకాలు, సుంకాల రహిత అడ్డంకులు, ఉత్పత్తి కేంద్రాల వద్ద లేదా వినియోగ స్థాయిలో మితి మించిన సరఫరా వ్యవస్థల కేంద్రీకృతం వంటి అంశాలు ఉన్నాయి. అలాగే, ప్రత్యేక భిన్నమైన పద్ధతులలోని లోపాలు, ఏకపక్ష పర్యావరణ చర్యలు, పరిమిత నియంత్రణలతో కూడిన సాంకేతిక అంతరం వంటి అంశాలు కూడా ప్రపంచ గ్లోబల్ వాణిజ్యానికి ప్రధాన సవాళ్లుగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. నిర్బంధ విధానాలు సేవల రంగంపై తీవ్ర ప్రభావం చూపాయని శ్రీ పీయూష్ గోయల్ పేర్కొన్నారు. ఇందువల్ల అభివృద్ధి చెందుతున్న దేశాలే అత్యధికంగా నష్టపోతున్నాయని ఆయన అన్నారు. గ్లోబల్ సౌత్ దేశాలన్నీ ఏకతాటిపైకి వచ్చి ఒకే గొంతుతో మాట్లాడాల్సిన అవసరాన్ని ఆయన స్పష్టం చేశారు.

స్వతంత్ర విధానాలు, స్థిరమైన అభివృద్ధి దిశగా నిబద్ధత,వృద్ధి మార్గంలో ఉన్న భారత్.. అభివృద్ధి చెందుతున్న, అభివృద్ధి చెందిన దేశాలు రెండింటి విశ్వాసాన్ని పొందిన అగ్రగామి దేశంగా నిలిచిందని శ్రీ గోయల్ పేర్కొన్నారు. సమానమైన, నమ్మిళితమైన, సుస్థిరమైన అభివృద్ధి సాధనలో వాణిజ్యాన్ని సమర్థంగా వినియోగించడంలో యూఎన్సీటీఏడీ పాత్ర కీలకమని ఉద్ఘాటించారు. సాంకేతికత, సహకారం, సుస్థిర సరఫరా వ్యవస్థల నిర్మాణంలో అభివృద్ధి చెందుతున్న దేశాలకు భారత్ మద్దతును మంత్రి ప్రకటించారు. వాణిజ్యం అభివృద్ధికి ఒక సాధనమని, దేశాలన్నీ కలిసికట్టుగా అందరి కోసం ఒక భవిష్యత్తును నిర్మించగలవని అన్నారు. ఈ దిశగా భారత్ " సబ్ కా సాథ్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్, సబ్ కా ప్రయాస్" అనే సూత్రాన్ని అనుసరిస్తోందని, అందరి సహకారం, అందరి అభివృద్ధి, పరస్పర విశ్వాసం, సమష్టి ప్రయత్నం ద్వారా సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన ఉద్ఘాటించారు. ప్రపంచమంతా ఒక కుటుంబమనే వసుధైక కుటుంబ భావనను భారత్ విశ్వసిస్తుందని ఆయన ప్రసంగాన్ని ముగించారు.

సుస్థిరమైన, నిలకడైన, సమగ్ర సరఫరా వ్యవస్థలు – వాణిజ్య రవాణా మార్గాలు అనే అంశంపై జరిగిన మంత్రుల స్థాయి రౌండ్ టేబుల్ సమావేశంలో శ్రీ పీయూష్ గోయల్ మాట్లాడుతూ, ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమం కింద భారత్ సాధించిన స్వావలంబనను, ముఖ్యంగా ఔషధాలు, కోవిడ్ టీకాల తయారీలో సాధించిన విజయాలను వ్రస్తావించారు. నమ్మకం, విశ్వసనీయతపై ఆధారపడ్డ వాణిజ్య సంబంధాలను బలపరచడంపై భారత్ నిబద్ధతను పునరుద్ఘాటించారు. ట్రిలియన్ డాలర్ మాస్టర్ ప్లాన్ గురించి ప్రముఖంగా ప్రస్తావిస్తూ, దేశీయ మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రతి సంవత్సరం సుమారు 130 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెడుతున్నట్టు చెప్పారు. విమానాశ్రయాలను 74 నుంచి 158కి విస్తరించడం, బలమైన అంతర్గత రవాణా నెట్‌వర్క్ కోసం రైలు, రహదారి, అంతర్గత జలమార్గాలను మెరుగుపరచడం, తయారీ వ్యవస్థను బలోపేతం చేయడం, రాబోయే దశాబ్దాలలో వేగవంతమైన వృద్ధి కొనసాగుతుందన్న అంచనాలతో, భారత్ ను ప్రపంచవ్యాప్తంగా విశ్వసనీయ భాగస్వామిగా నిలబెట్టడం వంటి కీలక పురోగతుల గురించి వివరించారు. చెల్లింపు వ్యవస్థలు, లావాదేవీలు, రవాణా భాగస్వామ్యం, పోర్టు సమయాలను తగ్గించడం వంటి సేవలను పంచుకోవడానికి అభివృద్ధి చెందుతున్న పెద్ద దేశాల మధ్య చర్చలు జరగాలని ఆయన ప్రతిపాదించారు. పరస్పర ప్రయోజనం కోసం అభివృద్ధి చెందుతున్న దేశాలు సహకరించుకోవాలని, కలిసి పనిచేయాలని కోరారు.

సదస్సు నేపథ్యంలో శ్రీ గోయల్ అంతర్జాతీయ భాగస్వామ్యాలను బలోపేతం చేయడానికి ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించారు. యూరోపియన్ కమిషన్ ఫర్ క్లీన్, జస్ట్ , కాంపిటీటివ్ ట్రాన్సిషన్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ తెరెసా రిబెరా రోడ్రిగేజ్‌తో భారత ఎగుమతులపై, ముఖ్యంగా ఉక్కు రంగంపై కార్బన్ బోర్డర్ అడ్జస్ట్‌మెంట్ మెకానిజం (సీబీఏఎం) ప్రభావం గురించి చర్చించారు. అలాగే, స్వచ్ఛ ఇంధన మార్పు కొత్త ఆధారపడే పరిస్థితులకు దారి తీయకూడదని అన్నారు. యూఎన్సీటీఏడీ సెక్రటరీ జనరల్ రెబెక్కా గ్రిన్స్పాన్ తో జరిగిన సమావేశంలో, సమానమైన ఆర్థిక మార్పులో యూఎన్సీటీఏడీ పాత్రను ముందుకు తీసుకెళ్లడం, అభివృద్ధి చెందిన దేశాల పారిస్ ఒప్పంద కట్టుబాట్లను నెరవేర్చడంలో లోపం, అన్యాయమైన ఏకపక్ష చర్యలు అభివృద్ధి చెందుతున్న దేశాల సహకారంపై చర్చించారు. దృష్టి సారించారు.

భవిష్యత్ రూపకల్పన, సమానమైన, సమ్మిళితమైన, స్థిరమైన అభివృద్ధికి ఆర్థిక మార్పును ముందుకు నడిపించడం – అనే యూఎన్సీటీఏడీ 16వ సదస్సు ఇతివృత్తాన్ని ప్రతిబింబిస్తూ, ప్రపంచ వాణిజ్యం, అభివృద్ధిలో విశ్వసనీయ భాగస్వామిగా భారత్ కట్టుబాటును ఈ పర్యటన మరోసారి చాటిచెప్పింది. శ్రీ గోయల్ పాల్గొన్న కార్యక్రమాలు అన్ని దేశాలకు పరస్పర సౌభాగ్యం, సుస్థిరత, సమ్మిళిత వృద్ధిని ప్రోత్సహించే నిబంధనల ఆధారిత బహుపాక్షిక వ్యవస్థ పట్ల భారతదేశ దార్శనికతను ఆవిష్కరించాయి.

త్రివిధ దళాల సంయుక్త.. సమ్మిళిత అసాధారణ శౌర్యపరాక్రమాలకు నిదర్శనం ఆపరేషన్ సిందూర్: రక్షణశాఖ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్

న్యూఢిల్లీ, అక్టోబర్ 23:"భారత త్రివిధ దళాల సంయుక్త, సమ్మిళిత అసాధారణ శౌర్యపరాక్రమాలకు ఆపరేషన్ సిందూర్ నిదర్శనం" అని రక్షణశాఖ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యానించారు. న్యూఢిల్లీలో ఈ రోజు "సివిల్–మిలిటరీ ఫ్యూజన్ యాజ్ ఎ మెట్రిక్ ఆఫ్ నేషనల్ పవర్ అండ్ కాంప్రహెన్సివ్ సెక్యూరిటీ" పేరిట లెఫ్టినెంట్ జనరల్ (రిటైర్డ్) రాజ్ శుక్లా రాసిన పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ– "మారుతున్న ప్రపంచ పరిస్థితులు, ఆధునిక యుద్ధపద్ధతుల నుంచి ఎదురయ్యే ఆకస్మిక సవాళ్లను ఎదుర్కొనే దిశగా సమన్వయంతో సానుకూల, ముందస్తు వ్యూహాల రూపకల్పనపై ప్రభుత్వ సంకల్పాన్ని ఇది పునరుద్ఘాటించింది'' అని పేర్కొన్నారు.

యుద్ధాలు సరిహద్దుల్లో మాత్రమేగాక మిశ్రమ, అసమతుల రూపం సంతరించుకున్న నేటి పరిస్థితులలో సంప్రదాయ రక్షణ దృక్పథం ఒక్కటే చాలదని రక్షణ మంత్రి స్పష్టం చేశారు. అందుకే, ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం జాతీయ భద్రత సహా దేశ వ్యూహాత్మక స్వయంప్రతిపత్తికి భరోసా ఇస్తూ, భవిష్యత్ సంసిద్ధ సాయుధ దళాల రూపకల్పన దిశగా అనేక సాహసోపేత, నిర్ణయాత్మక సంస్కరణలను చేపట్టిందని ఆయన వివరించారు.

''త్రివిధ దళాల మధ్య సమన్వయం, సమష్టి చర్యల బలోపేతం దిశగా 'చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్' పదవిని సృష్టించడం వీటిలో ఒక చరిత్రాత్మక చర్య. త్రివిధ దళాల సంయుక్త, సమ్మిళిత శక్తి ఫలితాలు ఎలాంటివో ఆపరేషన్ సిందూర్ సమయంలో యావత్ ప్రపంచం చూసింది. ఆ మేరకు సాయుధ బలగాలు కొట్టిన చావుదెబ్బ నుంచి పాకిస్థాన్ ఇప్పటికీ కోలుకునే స్థితిలో లేదు'' శ్రీ రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యానించారు.

పౌర–సైనిక సమ్మేళనాన్ని ఏకీకరణగా కాకుండా ఆవిష్కరణలను ప్రోత్సహించే, ప్రతిభను పరిరక్షించే, దేశాన్ని సాంకేతిక స్వావలంబన వైపు నడిపే వ్యూహాత్మక దోహదకారిగా పరిగణించాలని ఆయన అన్నారు. లెఫ్టినెంట్ జనరల్ (రిటైర్డ్) రాజ్ శుక్లా రాసిన పుస్తకం నుంచి మనం అనుసరించాల్సిన కీలకాంశాల్లో ఇదొకటని చెప్పారు. అయితే, "మన పౌరుల శ్రమశక్తి, ప్రైవేట్ రంగం, విద్యా వ్యవస్థ, రక్షణ రంగాలను సమష్టి జాతీయ ప్రయోజనం కోసం అనుసంధానిస్తే ఈ ఏకీకరణ సాధ్యం. ఇది మన ఆర్థిక ఉత్పాదకత, వ్యూహాత్మక ప్రయోజనాలను ఇనుమడింపజేస్తుంది" అని స్పష్టం చేశారు.

నేటి ప్రపంచం 'శ్రమ విభజన' భావనను అధిగమించి, 'లక్ష్యాల ఏకీకరణ' వైపు పయనిస్తున్నదని రక్షణ మంత్రి అన్నారు. ఈ నేపథ్యంలో విభిన్న బాధ్యతలను నిర్వర్తిస్తున్నప్పటికీ, ఉమ్మడి దృక్పథంతో కృషి చేయడం అవశ్యమని చెప్పారు. "శ్రమ విభజన పరంగా మన పౌర పరిపాలన, సైనిక బలగాల స్థాయి వేర్వేరుగా ఉండటం వాస్తవం. అయితే, మన ప్రధానమంత్రి పదవీ బాధ్యతలు చేపట్టిన నాటినుంచీ పరిపాలనలో ఏ విభాగం కూడా ఒంటెత్తు పోకడతో పనిచేయడం ఇక కుదరదని నిర్ద్వంద్వంగా ఆదేశించారు. ప్రతి ఒక్కటీ పరస్పర సహకారంతో ముందుకెళ్లాలని స్పష్టమైన రీతిలో మార్గనిర్దేశం చేశారు" అని ఆయన వివరించారు.

ప్రస్తుత సాంకేతికత ఆధారిత యుగంలో పౌర–సైనిక సమ్మేళనం స్వభావాన్ని అర్థం చేసుకోవాల్సిన అవసరం ఎంతయినా ఉందన్నారు. అంతర్జాతీయ తీర్మానాలను దృష్టిలో ఉంచుకుంటూ– సైనిక రంగంలో పౌర సాంకేతిక సామర్థ్యాల సమర్థ వినియోగానికిగల ప్రధాన సవాళ్లను గుర్తించి, కేంద్రీకృత విధానాన్ని అవలంబించడం అవశ్యమని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ పిలుపునిచ్చారు. ''నేటి ప్రపంచ దృక్పథంలో పౌర–సైనిక రంగాలు క్రమంగా ఏకమవుతున్నాయి. సాంకేతికత, ఆర్థిక వ్యవస్థ, జాతీయ భద్రత మునుపటితో పోలిస్తే ఇవాళ మరింత ముడిపడి ఉన్నాయి. సమాచారం, సరఫరా వ్యవస్థ, వాణిజ్యం, కీలక ఖనిజాలు, అత్యాధునిక సాంకేతికత వగైరాలన్నీ రెండు రంగాల్లోనూ వినియోగంలో ఉన్నాయి. ఈ పరిస్థితుల నడుమ పౌర–సైనిక కేవలం ఆధునిక ధోరణిగా కాకుండా నేటి తక్షణావసరంగా మారింది. దీన్ని విస్మరిస్తే వ్యూహాత్మక వృద్ధికి విఘాతం కలుగుతుంది. మన కీలక సాంకేతిక పరిజ్ఞానాలు చాలావరకూ పౌర వినియోగానికే పరిమితం అవుతున్నాయి. కాబట్టి, ద్వంద్వ–వినియోగ దృక్కోణంతో ఈ ఆవిష్కరణలను సైనిక–పౌర అనువర్తనాలకు పరస్పరం అన్వయిస్తే మన జాతీయ సామర్థ్యం అనేక రెట్లు ఇనుమడిస్తుంది'' అని ఆయన విశదీకరించారు.

పౌర–సైనిక సమ్మేళనం దిశగా ప్రభుత్వం చేపట్టిన నిర్దిష్ట చర్యలను ప్రముఖంగా ప్రస్తావిస్తూ– సాయుధ దళాలు, ప్రభుత్వం, పరిశ్రమలు, అంకుర సంస్థలు, పరిశోధన సంస్థలు, యువ ఆవిష్కర్తలు ఈ లక్ష్య సాధనలో సమష్టిగా కృషిచేస్తున్నారని రక్షణ మంత్రి అన్నారు. భారత రక్షణావరణ వ్యవస్థలో కొన్నేళ్లుగా చారిత్రక రూపాంతరీకరణ చోటుచేసుకున్నదని గుర్తుచేశారు. ఆ మేరకు ప్రపంచంలో అతిపెద్ద రక్షణ దిగుమతిదారుగా ఉన్న భారత్ శరవేగంగా ముందడుగు వేస్తూ నేడు తయారీ కూడలిగా వృద్ధి చెందుతోందన్నారు. "మా నిరంతర కృషి ఫలితంగా, భారత రక్షణ రంగం అత్యున్నత శిఖరాలకు చేరుకుంటోంది. ఎలాగంటే– దశాబ్దం కిందట దేశీయ రక్షణ ఉత్పాదన దాదాపు రూ.46,000 కోట్లు కాగా, ఇప్పుడు రికార్డు స్థాయిలో రూ.1.51 లక్షల కోట్లకు పెరిగింది. ఇందులో ప్రైవేట్ రంగం వాటా దాదాపు రూ.33,000 కోట్లు" అని ఆయన వివరించారు.

ఈ కార్యక్రమంలో 'చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్' జనరల్ అనిల్ చౌహాన్, 'చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్' జనరల్ ఉపేంద్ర ద్వివేది, 'యునైటెడ్ సర్వీస్ ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఇండియా' డైరెక్టర్ జనరల్ (రిటైర్డ్) మేజర్ జనరల్ బి.కె.శర్మ, సీనియర్ సివిల్, మిలిటరీ అధికారులు, నిపుణులు పాల్గొన్నారు.

దళారులను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం

–మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నల్లగొండ, అక్టోబర్ 23 : వర్షాలతో పత్తి రైతులు తీవ్రంగా నష్టపోతున్నా ప్రభుత్వం సీసీఐ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకుండా దళారులను ప్రోత్సహిస్తుందని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. గురువారం చిట్యాల మండలంలోని పెద్దకాపర్తి గ్రామంలో గల పత్తి చేనులను ఆయన పరిశీలించారు. పత్తి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ? పత్తి సీజన్ వచ్చినా రాష్ట్రంలో సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఇంకా ఎందుకు ప్రారంభించడం లేదో ప్రభుత్వం సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. వర్షాల కారణంగా పత్తిని స్టాక్ పెట్టుకోలేక రైతులు సతమతం అవుతున్నట్లు తెలిపారు.

దళారులు చేతుల్లోకి రైతులను నెట్టేందుకే రాష్ట్ర ప్రభుత్వం సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదన్నారు. కేసీఆర్ పాలనలో రైతులకు లాభం కలిగేలా పంటలకు సరైన మద్దతు ధర ఇచ్చి సమయానుకూలంగా కొనుగోలుకు చర్యలు చేపట్టేవారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఇబ్బందుల్లోకి నెట్టి రైతులను బాధలు పెడుతుందని దుయ్యబట్టారు. తెలంగాణ నుండి కేంద్ర మంత్రులు, ఎంపీలు ఈ విషయంలో చర్యలు తీసుకోవాలన్నారు.

కాంగ్రెస్ నాయకులు కేసీఆర్ మీద విమర్శలు చేయడం తప్పా ప్రజలకు ఇంత వరకు ఏం చేశారో చెప్పాలన్నారు. రైతు సంక్షేమం జాడలేదు, వడ్ల బోనస్ ఊసు లేదు, పండిన పంటను కొనుగోలు చేసే దిక్కే లేదు, సకాలంలో ఎరువులు ఇవ్వడం చేతకాదు, మద్దతు ధర ఇచ్చే పరిస్థితిలో కూడా ప్రభుత్వం లేదన్నారు. ఇప్పటికైనా రైతులను ఇబ్బందులు పెట్టకుండా, ఆంక్షలు లేకుండా పత్తి కొనుగోళ్లు చేసి మద్దతు ధర ఇవ్వాలని బీఆర్ఎస్ పార్టీ తరుపున తాము డిమాండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కల్లూరి మల్లారెడ్డి, రుద్రారం భిక్షపతి, బాలగొని రాజు, కొలను వెంకటేశ్, రమణారెడ్డి, మర్రి జలంధర్ రెడ్డి పాల్గొన్నారు.

పోలీసులతో యువత భాగస్వామ్యం కావాలి : సీపీ అంబర్ కిషోర్ ఝా

ఆదిలాబాద్, అక్టోబర్ 23:యువత పోలీసులతో భాగస్వామ్యం కావాలని రామగుండం పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. మంచిర్యాల జిల్లా తాండూర్ పోలీస్ స్టేషన్‌ను గురువారం ఆయన సందర్శించారు. స్టేషన్ పరిసరాలు పరిశీలించి పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతలకు సంబంధించి రిసెప్షన్ కానిస్టేబుల్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఫిర్యాదులపై తక్షణమే స్పందించి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఎస్సై, సిబ్బందికి సూచించారు. అన్ని ప్రభుత్వ విభాగాల్లో ప్రజల కోసం ప్రాణ త్యాగాలు చేసే విభాగం పోలీస్ విభాగం ఒక్కటేనని అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా కమ్యూనిటీ పోలీస్‌లో భాగంగా యువతకు వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. ఆనంతరం సీపీ మాట్లాడారు.

నేటితరం యువత చదువు తోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడలు శారీరక దృఢత్వానికి, మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, డ్రగ్స్ లాంటి మత్తుపదార్థాలను విడనాడాలని కోరారు. సీపీ వెంట మంచిర్యాల డీసీపీ ఎ బాస్కర్, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, తాండూర్ సీఐ దేవయ్య, తాండూర్, మాచారం ఎస్సైలు కిరణ్ కుమార్, సౌజన్య, సిబ్బంది ఉన్నారు.

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ముస్లింలకు శ్మశాన వాటిక స్థలం ఇచ్చే బాధ్యత నాది : కేటీఆర్

హైదరాబాద్, అక్టోబర్ 23:జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ముస్లింలకు శ్మశాన వాటిక స్థలం ఇచ్చే బాధ్యత నాది అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో సల్మాన్ ఖాన్ గులాబీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లింలకు అన్యాయం చేస్తోంది. మైనార్టీ మంత్రి లేని ఏకైక కాంగ్రెస్ కేబినెట్ రేవంత్ రెడ్డిదే. ఎమ్మెల్యే, మంత్రి పదవి ఇవ్వకుండా అజారుద్దీన్‌ను బలి చేశారు. సీఎం, మంత్రి మధ్య గొడవలో ఐఏఎస్ అధికారి రిజ్వీని బలి చేశారు. ఒక ఐఏఎస్‌కే రక్షణ లేకపోతే సామాన్యుల పరిస్థితి ఏంటి.. అని కేటీఆర్ ప్రశ్నించారు.

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ముస్లింలకు శ్మశాన వాటిక స్థలం ఇచ్చే బాధ్యత నాది. ఈ ప్రభుత్వంతో కొట్లాడి ఇప్పిస్తా.. ఒకవేళ ఇవ్వకపోతే, రెండేళ్లలో కేసీఆర్ సీఎం అవుతారు, మొదటి వారంలోనే జీవో తీసుకొచ్చి స్థలం ఇస్తాం. ప్రభుత్వ స్థలం దొరకకపోతే, ప్రైవేట్ స్థలాన్ని కొని అయినా ఇస్తాం. కేసీఆర్ హయాంలో రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలలో ముస్లిం, క్రిస్టియన్ మైనారిటీల శ్మశాన వాటిక కోసం 125 ఎకరాల భూమిని ఇచ్చాం అని కేటీఆర్ తెలిపారు.

రేవంత్ రెడ్డి మిలిటరీకి చెందిన స్థలాన్ని ముస్లిం శ్మశాన వాటికకు ఇచ్చాడు. అది మిలటరీకి చెందిన స్థలమని తెలిసి, అది వాళ్లు గుంజుకుంటారని తెలిసి ముస్లిం ప్రజలను మాయ చేసేందుకు ప్రయత్నించాడు. 70 ఏళ్ల స్వతంత్ర దేశంలో ముస్లిం ప్రజలు ఇంకా పే

ప్రాదేశిక సైన్యంలో లెఫ్టినెంట్ కర్నల్ గౌరవ హోదా అధికార చిహ్నాన్ని జావెలిన్ క్రీడాకారుడు శ్రీ నీరజ్ చోప్రాకు లాంఛనంగా ప్రదానం చేసిన రక్షణ మంత్రి

న్యూఢిల్లీ, అక్టోబర్ 23:ఒలింపిక్స్‌లో రెండు సార్లు పతకాలను సాధించిన జావెలిన్ క్రీడాకారుడు శ్రీ నీరజ్ చోప్రాకు ప్రాదేశిక సైన్యంలో లెఫ్టినెంట్ కర్నల్ గౌరవ హోదాను సూచించే అధికార చిహ్నాన్ని రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ ఈ రోజు న్యూఢిల్లీలోని సౌత్ బ్లాకులో నిర్వహించిన కార్యక్రమంలో... స్వయంగా అలంకరించారు. ఈ సందర్భంగా లెఫ్టినెంట్ కర్నల్ (గౌరవనీయ హోదా) నీరజ్ చోప్రాతో, ఆయన కుటుంబ సభ్యులతో రక్షణ మంత్రి మాట్లాడుతూ నిరంతర శ్రమకూ, దేశభక్తికీ, అత్యుత్తమ సాధన కోసం పోరాడే భారతీయతకూ శ్రీ చోప్రా నిదర్శనమని ప్రశంసించారు.

క్రమశిక్షణ, అంకితభావం, దేశాభిమానం కలబోసుకున్న లెఫ్టినెంట్ కర్నల్ (గౌరవ హోదా) నీరజ్ చోప్రా.. క్రీడాకారులతో పాటు సాయుధ దళాలకు ఎప్పటికీ స్ఫూర్తిని అందిస్తారని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. సైనిక దళాల ప్రధానాధికారి జనరల్ ఉపేంద్ర ద్వివేదితో పాటు భారతీయ సైన్యంలోని, ప్రాదేశిక సైన్యంలోని ఇతర సీనియర్ అధికారులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

లెఫ్టినెంట్ కర్నల్ (గౌరవ హోదా) నీరజ్ చోప్రా 2016లో భారతీయ సైన్యంలో చేరారు. రాజ్‌పుతానా రైఫిల్స్‌కు తన సేవలను అందించారు. 1997 డిసెంబరు 24న హర్యానా పానిపట్ జిల్లాలోని ఖండ్రా గ్రామంలో పుట్టిన శ్రీ నీరజ్ చోప్రా, అంతర్జాతీయ క్రీడా పోటీల్లో ప్రశంసనీయ విజయాలను సాధించి... దేశానికీ, సాయుధ దళాలకూ అమిత గౌరవాన్ని తెచ్చిపెట్టారు.

జావెలిన్‌ను విసరడంలో పేరు తెచ్చుకున్న శ్రీ నీరజ్ చోప్రా 2020లో టోక్యో ఒలింపిక్స్‌లో ట్రాక్ అండ్ ఫీల్డ్ పోటీల్లో ఒలింపిక్ స్వర్ణ పతకాన్ని గెలిచిన మొదటి భారతీయ క్రీడాకారునిగా నిలిచి చరిత్ర స?ష్టించారు. 2024లో ప్యారిస్ ఒలింపిక్స్‌లో రజత పతకాన్ని గెల్చుకోవడంతో పాటు 2023 వరల్డ్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్‌లో స్వర్ణ పతకాన్ని సాధించి తనదైన ప్రతిభను చాటారు. ఆసియా క్రీడలు, కామన్‌వెల్త్ క్రీడలు, డైమండ్ లీగ్ ఈవెంట్లలోనూ అనేక స్వర్ణ పతకాలను ఆయన సొంతం చేసుకున్నారు. ఈ ఏడాదిలో 90.23 మీటర్ల దూరం జావెలిన్‌ను విసరడం ఆయన అత్యుత్తమ ఆటతీరుకు అద్దం పట్టడమే కాక భారతీయ క్రీడాచరిత్రలోనే ఒక మహత్తర ఘట్టంగా కూడా నమోదైంది.

దేశానికి ఆయన చేసిన సేవతో పాటు ఆయన అద్భుత విజయాలకు గుర్తింపుగా ఈ సంవత్సరం ఏప్రిల్ 16న ప్రాదేశిక సైన్యంలో లెఫ్టినెంట్ కర్నల్ హోదాను (గౌరవ) నీరజ్ చోప్రాకు రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపదీ ముర్ము అందించారు. అంతకు ముందే, పద్మ శ్రీ, మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న పురస్కారం, అర్జున పురస్కారం, పరమ విశిష్ట సేవా పతకంతో పాటు విశిష్ట సేవా పతకంతో కూడా కేంద్ర ప్రభుత్వం ఆయనను సత్కరించింది.

దేశ వ్యాప్తంగా సీపీఆర్ అవగాహన వారోత్సవం.. ప్రజా ప్రతిస్పందన సామర్థ్యాన్ని బలోపేతం చేసే దిశగా చర్యలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 23:ప్రజల్లో సీపీఆర్ (కంప్రెషన్-ఒన్లీ కార్డియోపల్మనరీ రీసస్సిటేషన్)పై అవగాహన పెంచడం, అత్యవసర పరిస్థితుల్లో ప్రజల ప్రాథమిక స్పందన సామర్థ్యాన్నిపెంపొందించే లక్ష్యంతో అక్టోబర్ 13 నుంచి 17 వరకు దేశవ్యాప్తంగా సీపీఆర్ అవగాహన వారోత్సవాన్ని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ నిర్వహించింది. గుండెపోటు, ఇతర వైద్య అత్యవసర పరిస్థితుల్లో తొందరగా చుట్టుపక్కనవాళ్లు స్పందించడంపై ప్రజలకు అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ లక్ష్యం.

సీపీఆర్ కు ప్రాణాలను రక్షించే సామర్థ్యం ఉందని ఎన్నో పరిశోధనల్లో నిరూపితమైనప్పటికీ, అంతర్జాతీయ ప్రమాణాలతో పోలిస్తే భారత్ లో బాధితుల పక్కనే ఉండి తక్షణం స్పందించి సీపీఆర్ అందించే వారి సంఖ్య తక్కువగానే ఉంది. వారం రోజులపాటు జరిగిన ఈ కార్యక్రమం ద్వారా ఈ అంతరాన్ని తగ్గించేందుకు విస్తృత స్థాయిలో సీపీఆర్ శిక్షణ, అవగాహన, ప్రవర్తన పరమైన సంసిద్ధతను ప్రజల్లో ప్రోత్సహించడాన్ని మంత్రిత్వ శాఖ లక్ష్యంగా పెట్టుకుంది.

సీపీఆర్ అవగాహన వారోత్సవం లక్ష్యాలు: ప్రాణాలను కాపాడే సీపీఆర్ ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, వివిధ భాగస్వాముల సహకారంతో ఆచరణాత్మక శిక్షణలు, ప్రదర్శనలు అందించడం, యువతలో సేవాభావం పెంపొందించడం, సమాజ హిత కార్యక్రమాల్లో భాగస్వాములయ్యేలా ప్రోత్సహించడం, డిజిటల్ వేదికలను వినియోగించి విస్తృతంగా ప్రజలకు ఈ సమాచారాన్ని చేరవేయడం.

ఈ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా బహుళ భాగస్వాముల సమన్వయంతో అమలు చేశారు. గ్రామీణ స్థాయిలో శిక్షణలు, అవగాహన కార్యక్రమాలను నిర్వహించడంలో రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ఆరోగ్య, వైద్య విద్యా శాఖలు కీలకపాత్ర పోషించాయి. హోం మంత్రిత్వశాఖ, రక్షణ, కార్మిక, ఉపాధి, యువజన వ్యవహారాలు, క్రీడలు, ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతికత, ఉన్నత విద్య, పాఠశాల విద్య, అక్షరాస్యత, రైల్వేలు, ఆరోగ్య పరిశోధన శాఖ, జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ వంటి కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు, సంస్థలు.. సమాజంలోని వివిధ వర్గాల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించాయి. కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రులు, ఏయిమ్స్, జాతీయ ప్రాముఖ్యత కలిగిన సంస్థలు, ఆరోగ్య మంత్రిత్వ శాఖకు చెందిన స్వయంప్రతిపత్తి కలిగిన సంస్థలు.. శిక్షణలు, అవగాహన కార్యక్రమాలను నిర్వహించాయి. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తన రాష్ట్ర, కేంద్ర పాలిత ప్రాంతాలు, జిల్లా ఉపకేంద్రాల్లో సామాజిక సీపీఆర్ శిక్షణ కార్యక్రమాలను నిర్వహించింది. వృత్తిపరమైన సంస్థలు తమ రాష్ట్ర శాఖల ద్వారా శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాయి. డిజిటల్ అవగాహన, యువత భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ, యువజన వ్యవహారాలు క్రీడల మంత్రిత్వ శాఖ పలు కార్యక్రమాలు నిర్వహించాయి.

సీపీఆర్ అవగాహన వారోత్సవం సందర్భంగా విస్తృత స్థాయిలో ప్రజలు పాల్గొనడం, అవగాహన పెంపొందించేందుకు అనేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈసీహెచ్ఓ వేదిక, యూట్యూబ్ లైవ్ ద్వారా నిర్వహించిన సీపీఆర్ ప్రదర్శన ప్రారంభ కార్యక్రమంలో మొత్తం 14,701 మంది పాల్గొన్నారు. సీపీఆర్ అవగాహనకు కట్టుబడి ఉంటామని 79,870 మంది పౌరులు మై గవర్నమెంట్ వేదిక ద్వారా ప్రతిజ్ఞ చేశారు.

"సీపీఆర్ పద్ధతులు, పక్కవాళ్ల పాత్ర" అనే అంశంపై నిపుణులతో చర్చాకార్యక్రమాలు నిర్వహించారు. విపత్తు నిర్వహణ సెల్‌కు చెందిన ఉప డైరెక్టర్ జనరల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ చర్చల్లో ఏయిమ్స్ న్యూఢిల్లీ, డాక్టర్ ఆర్ఎమ్ఎల్ ఆసుపత్రి, సఫ్దర్‌జంగ్ ఆసుపత్రి, ఎస్ జీటీ మెడికల్ కళాశాలకు చెందిన ఆరుగురు నిపుణులు పాల్గొన్నారు. ఈసీహెచ్ఓ, యూట్యూబ్ లైవ్ ద్వారా జరిగిన ఈ కార్యక్రమంలో 10,129 మంది పాల్గొనగా.. వీరికి సీపీఆర్, ఆటోమేటెడ్ ఎక్స్‌టర్నల్ డీఫిబ్రిలేటర్స్ (ఏఈడీ) ఉపయోగించడంపై ప్రత్యక్ష ప్రదర్శనలు ఇచ్చారు.

సీపీఆర్ అవగాహన వారోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా విస్తృత స్థాయిలో సీపీఆర్ శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. వీటిని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల వైద్య శాఖలు, కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రులు, ఏయిమ్స్, జాతీయ ప్రాధాన్యత గల సంస్థలు, ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ, వృత్తి పరమైన సంస్థలు నిర్వహించగా మొత్తం 6,06,374 మంది ఈ శిక్షణలో పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, సీఐఎస్ఎఫ్ సిబ్బంది, హౌస్‌కీపింగ్ సిబ్బంది, వివిధ మంత్రిత్వ శాఖల అధికారులకు నిర్మాణ్ భవన్ లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. దీనిద్వారా మొత్తం 264 మంది లబ్ధి పొందారు. అలాగే ప్రధానమంత్రి కార్యాలయానికి చెందిన 70 మంది అధికారులకు అక్టోబర్ 16న ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ప్రజలను భాగస్వామ్యం చేసేందుకు మై గవర్నమెంట్, మై భారత్ వేదికల ద్వారా సీపీఆర్ పై ప్రశ్నోత్తరాల పోటీని నిర్వహించారు. ఇందులో 36,040 మంది పాల్గొన్నారు. వీటికితోడు 'వాలంటీర్ ఫర్ భారత్' కార్యక్రమం ద్వారా 368 మంది యువకులు సీపీఆర్ అవగాహనను ప్రోత్సహించేందుకు స్వచ్ఛందంగా ముందుకొచ్చారు.

ఆరోగ్య మంత్రిత్వ శాఖ మీడియా సెల్ సహకారంతో సీపీఆర్ అవగాహనను పెంచేందుకు అనేక డిజిటల్, సామాజిక మాధ్యమాల ద్వారా కార్యకలాపాలను చేపట్టింది.మంత్రిత్వ శాఖకు చెందిన యూట్యూబ్ ఛానెల్‌లో సీపీఆర్ పై ఒక విద్యా వీడియోను అభివృద్ధి చేసి ప్రచురించారు. ఈ వీడియోను రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ప్రామాణిక విద్యా వనరుగా అందుబాటులో ఉంచారు.

నిపుణుల ఇంటర్వ్యూలను ఆంగ్లం, హిందీలో మంత్రిత్వ శాఖకు చెందిన సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచురించారు. ఇవి సీపీఆర్ సాంకేతిక అంశాలు, ప్రజలకు దాని ప్రాధాన్యతను తెలియజేస్తాయి. ఇతర ఐఈసీ (సమాచారం, విద్య, కమ్యూనికేషన్) మెటీరియల్స్, కార్యక్రమ ప్రచారాలు అన్నీ కూడా డిజిటల్ వేదికలపై విస్తృత స్థాయిలో వీక్షణ పొందాయి. వీటికి ప్రజల మంచి స్పందన లభించింది.

ఆరోగ్యశాఖ కార్యదర్శి సమక్షంలో నిపుణుల ద్వారా అక్టోబర్ 13న నిర్వహించిన సీపీఆర్ ప్రత్యక్ష ప్రదర్శనను దూరదర్శన్ సహా పలు వార్తా సంస్థలు ప్రచురించాయి. అక్టోబర్ 19న దూరదర్శన్ ఛానల్ లో "టోటల్ హెల్త్ - మెడికల్ ఎమర్జెన్సీ" అనే శీర్షికతో ప్రత్యేక కార్యక్రమం ప్రసారం చేశారు. ఇది సీపీఆర్ ప్రత్యక్ష ప్రదర్శనలను ప్రదర్శించిన ఈ కార్యక్రమంలో ఏయిమ్స్, న్యూఢిల్లీ నుంచి నిపుణులు ప్యానెల్ సభ్యులుగా పాల్గొన్నారు.

బహుముఖ కార్యకలాపాల ద్వారా నిర్వహించిన సీపీఆర్ అవగాహన వారోత్సవంలో 7,47,000 మందికి పైగా పౌరులు నిమగ్నమయ్యారు. దేశవ్యాప్తంగా 6,06,374 పైగా మందికి శారీరక శిక్షణ ఇచ్చారు.

ఆసక్తి ఉంటే ఏ శక్తి మనల్ని ఆపలేదు

-లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి, విశ్రాంత ప్రిన్సిపాల్, రచయిత

హైదరాబాద్, అక్టోబర్ 23:మనం ఎంచుకున్న మహోన్నత లక్ష్యాన్ని చేజిక్కించుకోవాలనే అపరిమిత ఆసక్తి ఉంటే మనల్ని ఏ శక్తి అడ్డుకోలేదని ప్రముఖ పాఠ్య పుస్తకాల రచయిత, విశ్రాంత ప్రిన్సిపాల్ లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి అన్నారు. ఈ రోజు లీడ్ ఇండియా, శాతవాహన లయన్స్ క్లబ్‌లు సంయుక్తంగా స్థానిక మంకమ్మతోట సిద్ధార్థ హైస్కూల్ ఆవరణలో నిర్వహించిన జాతీయ రసాయన శాస్త్ర వారోత్సవాల్లో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ మన దైనందిన జీవితంలో రసాయన శాస్త్రం విడదీయరాని అనుబంధాలను పెనవేసుకుందని తెలిపారు. ఉదయం టూత్ బ్రష్ వేసుకోవడం నుంచి రాత్రి పడుకునే వరకు మన నికత్య దిన చర్యలో రసాయన పదార్థాలు మాత్రమే మన ఆరోగ్యాన్ని కాపాడుతున్నాయని తెలిపారు. మనం చూసిన ప్రతి ప్రక్రియను విశ్లేషణాత్మకంగా పరిశీలించి దాని లోతులను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలని అన్నారు. విపరీతంగా పెరుగుతున్న శాస్త్ర సాంకేతిక అంశాలను తెలుసుకుంటూ వాటిని మన ఎదుగుదలకు ఉపయోగపడేలా చూసుకోవాలని సూచించారు. సైన్స్ అంటేనే ప్రయోగాలతో రుజువు చేసుకునే శాస్త్రం అని మరువకుండా ప్రతి అంశాన్ని అధ్యయనం చేయడానికి కృషి చేయాలని అన్నారు. సభాధ్యక్షత వహించిన సిద్ధార్థ పాఠశాలల చైర్మన్ శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత విద్య వరకు తమ చదువులను కొనసాగించి అత్యుత్తమ స్థాయి ఉద్యోగాలను పొందే విధంగా కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా నిర్వహించిన కెమిస్ట్రీ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ముఖ్య అతిథి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ ఎం రవీంద్రా చారి, ఉపాధ్యాయులు, 170 మంది పదవ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు.

ఛఠ్ పండగ రద్దీ దృష్ట్యా రాబోయే 5 రోజుల్లో 1,500 ప్రత్యేక రైళ్లను నడపనున్న భారతీయ రైల్వేలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 23:దేశవ్యాప్తంగా ప్రజలను అనుసంధానించడంలో... ముఖ్యంగా పండగల సీజన్‌లో ప్రజలకు సౌకర్యవంతమైన ప్రయాణ అనుభవాన్ని అందించడంలో భారతీయ రైల్వేలు కీలక పాత్ర పోషిస్తూనే ఉన్నాయి. ఛఠ్ పూజ ఉత్సవాలకు ముందు ప్రయాణికుల రద్దీ అధికంగా పెరుగుతుండడంతో ప్రయాణికులందరూ సురక్షితంగా, సౌకర్యవంతంగా తమ గమ్యస్థానాన్ని చేరుకునేలా రైల్వే శాఖ చర్యలు చేపట్టింది. సాధారణ రైలు సేవలతో పాటుగా రాబోయే ఐదు రోజుల్లో రోజుకు సగటున 300 ప్రత్యేక రైళ్లతో 1500 ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. సమర్థమైన ఏర్పాట్లు... ప్రయాణికులకు మెరుగైన సేవలు, సౌలభ్యం, సంరక్షణ అందించడం పట్ల నిబద్ధతతో... ఈ పండగ సీజన్‌లో ప్రయాణికులందరికీ రైలు ప్రయాణంలో నాణ్యమైన సేవలు అందించేలా భారతీయ రైల్వే చర్యలు చేపట్టింది. సాధారణ రైళ్లతో పాటుగా గత 21 రోజుల్లో 4,493 ప్రత్యేక రైలు ప్రయాణాలు, రోజుకు సగటున 213 ట్రిప్పులతో దీపావళి పండగ కోసం ప్రయాణికులు సురక్షితంగా ఇంటికి చేరుకునేలా రైల్వే శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.

ఈ సంవత్సరం రాబోయే ఛఠ్ పూజ, ప్రస్తుతం కొనసాగుతున్న దీపావళి సీజన్ కోసం పండగ ప్రయాణ రద్దీ నిర్వహణకు భారత రైల్వే పటిష్టమైన ప్రత్యేక రైలు షెడ్యూల్‌ను అమలు చేస్తోంది. అక్టోబర్ 1 నుంచి నవంబర్ 30 వరకు 61 రోజుల వ్యవధిలో దేశవ్యాప్తంగా 12,000 కంటే ఎక్కువ ప్రత్యేక రైళ్లు నడిపిస్తోంది. ఇప్పటివరకు మొత్తం 11,865 ట్రిప్పులు (916 రైళ్లు) నమోదు కాగా... వీటిలో 9,338 రిజర్వ్డ్, 2,203 అన్‌రిజర్వ్డ్ ట్రిప్పులు ఉన్నాయి. గత సంవత్సరం కంటే ఇది గణనీయమైన పెరుగుదలను సూచిస్తుంది. పండగ సీజన్‌లో ప్రయాణికులకు సజావుగా, సౌకర్యంగా ఉండే ప్రయాణ అనుభవాన్ని అందించడం పట్ల భారతీయ రైల్వే నిరంతర నిబద్ధతను ఇది ప్రతిబింబిస్తోంది.

కల్లుగీత కార్మిక సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి : దండెంపల్లి శ్రీనివాస్

నల్గొండ, అక్టోబర్ 23:చిట్యాల పట్టణంలో ఈ నెల 25న నిర్వహించే కల్లుగీత కార్మిక సంఘం 4వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం నల్లగొండ జిల్లా కమిటీ సభ్యుడు దండెంపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం కట్టంగూర్ లోని అమరవీరుల స్మారక భవనంలో మహాసభల పోస్టర్ ను సంఘం నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్ర కల్లుగీత కార్పోరేషన్ కు ప్రభుత్వం రూ.5 వేల కోట్లు బడ్జెట్ లో కేటాయించి ప్రతి సొసైటీకి 5 ఎకరాల స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో నీరా, తాటి, ఈత ఉత్పత్తుల పరిశ్రమలను ఏర్పాటు చేసి గౌడ్ యువకులకు ఉపాధి కల్పించాలన్నారు.

అర్హులైన ప్రతి గీత కార్మికుడికి సభ్యత్వంతో పాటు గుర్తింపు కార్డులు కొత్త జిల్లాల పేరుతో ఇవ్వాలని కోరారు. ప్రమాదంలో చనిపోయిన, శాశ్వత వికలాంగులకు రూ.10 లక్షల ఎక్స్ గ్రేషియా అందించి వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, పిల్లలకు ఉచిత విద్యనందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం మండలాధ్యక్షుడు మాద శ్రీను, గౌరవ అధ్యక్షుడు చౌగోని లింగయ్య, ఉపాధ్యక్షులు పసస యాదయ్య, ఆకుల శంకరయ్య, సురిగి సత్తయ్య, సహాయ కార్యదర్శి వేముల సైదులు, కోశాధికారి నీలం అంజయ్య, నర్సింహ్మ, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దేశవ్యాప్తంగా 20,000 కిలోమీటర్లకుపైగా జాతీయ రహదారులపై నెట్‌వర్క్ సర్వే వాహనాలలు మోహరించనున్న ఎన్‌హెచ్ఏఐ

న్యూఢిల్లీ, అక్టోబర్ 23:జాతీయ రహదారులపై వాహనదారుల ప్రయాణ అనుభవాన్ని మెరుగుపరిచేందుకు ఎన్‌హెచ్ఏఐ దేశవ్యాప్తంగా 23 రాష్ట్రాల్లో 20,933 కిలోమీటర్ల విస్తీర్ణంలో నెట్‌వర్క్ సర్వే వాహనాలను మోహరించనుంది. ఇవి జాతీయ రహదారుల భాగాలపై రహదారి జాబితా, రోడ్డు ఉపరితల స్థితిని సేకరించడానికి, ప్రాసెస్ చేయడానికి, విశ్లేషించడానికి వినియోగపడతాయి. రహదారి ఉపరితలంపై పగుళ్లు, గుంతలు, అతుకులు వంటి లోపాలు, ఎన్ఎస్‌వీ సర్వేల ద్వారా సేకరించిన డేటా ఆధారంగా బయటపడతాయి. దీంతో జాతీయ రహదారుల మెరుగైన నిర్వహణ కోసం ఎన్‌హెచ్ఏఐ చర్యలు తీసుకుంటుంది.

ఎన్ఎస్‌వీ సర్వే ద్వారా సేకరించిన సమాచారాన్ని ఎన్‌హెచ్ఏఐ 'డేటా లేక్' అనే కృత్రిమ మేధా ఆధారిత పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తుంది. అక్కడ ఉన్న నిపుణుల బృందం ఈ సమాచారాన్ని విశ్లేషించి, ఉపయోగకరమైన సమాచారం, కార్యాచరణ సూచనలు రూపొందిస్తారు. అంతేగాక కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి క్రమం తప్పకుండా సేకరించిన సమాచారాన్ని భవిష్యత్తు సాంకేతిక ప్రయోజనాల కోసం రోడ్డు అసెట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లో (ఆర్ఏఎంఎస్) నిర్దిష్ట ఫార్మాట్లలో భద్రపరచాలి.

ఈ సర్వేలు 3డీ లేజర్ ఆధారిత ఎన్ఎన్‌వీ సిస్టమ్ ద్వారా జరుగుతాయి. ఇవి హై రెజల్యూషన్ 360 డిగ్రీ కెమెరాలు, డిఫరెన్షియల్ జీపీఎస్,ఇనెర్షియల్ మెజర్‌మెంట్ యూనిట్, డిస్టెన్స్ మెజరింగ్ ఇండికేటర్ సహాయంతో మానవ జోక్యం లేకుండానే రహదారి లోపాలను గుర్తించి నివేదించగలవు. ఈ వాహనాలలో ఉన్న అధునాతన సాఫ్ట్‌వేర్ ద్వారా రహదారి డేటా ఖచ్చితంగా సేకరించవచ్చు. ఈ వాహనాల్లో అనేక విధాల డేటా సేకరణ, ప్రాసెసింగ్ సాఫ్ట్‌వేర్ అమర్చబడి ఉంటుంది. వీటి సహాయంతో రోడ్డు మౌలిక వివరాలు, ఉపరితల స్థితి డేటాను ఖచ్చితంగా కొలిచి, నివేదిక రూపంలో అందించవచ్చు .వివిధ లైన్ల ప్రాజెక్టుల ప్రారంభానికి ముందు ఎన్ఎన్‌వీ ద్వారా ప్రమాణిత డేటా సేకరణ జరుగుతుంది. ప్రతి ఆరు నెలలకొకసారి పునఃసర్వేలు నిర్వహించి పేవ్‌మెంట్ పరిస్థితుల డేటాను అప్‌డేట్ చేయాలి. ఈ కార్యక్రమాన్ని అమలు చేయడానికి ఎన్‌హెచ్ఏఐ అర్హత కలిగిన కంపెనీల నుంచి టెండర్లను ఆహ్వానించింది.

నెట్‌వర్క్ సర్వే వాహన వ్యవస్థ (ఎన్ఎన్ వీ) దేశ జాతీయ రహదారుల నిర్వహణ కోసం రూపొందించిన ఒక ప్రత్యేక మౌలిక సదుపాయాల నిర్వహణ సాధనం. ఇందులో అధునాతన సెన్సార్లు, డేటా సేకరణ పద్ధతులు గల వాహనాలు ఉంటాయి. ఇవి జాతీయ రహదారుల స్థితి, జాబితా సంబంధిత డేటాను సేకరించగల సామర్థం కలిగి ఉన్నాయి. ఈ డేటా ద్వారా రోడ్డు ఉపరితల స్థితి నిర్వహణ, ఆస్తి నిర్వహణ, మౌలిక సదుపాయాల ప్రణాళిక వంటి అంశాల్లో కీలకమైన నిర్ణయాలు తీసుకోవచ్చు. దీనివల్ల దేశవ్యాప్తంగా జాతీయ రహదారుల భద్రత సామర్థ్యం మెరుగుపడుతుంది.

నీళ్లలో ఈదుకుంటూ వెళ్లి చెరువులోని విద్యుత్ స్తంభానికి ఇన్సులేటర్ అమర్చిన సిబ్బంది

నిడమనూరు, అక్టోబర్ 23 : నిడమనూరు మండలంలోని ఎర్రబెల్లి ఫీడర్ పరిధిలో 132 కేవీ విద్యుత్ లైన్ 133 కేవీ ఇన్సులేటర్ విఫలమవడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. సోమోరిగూడెం చెరువు గుండా వెళ్లే విద్యుత్ స్థంభం ఇన్సులేటర్ విఫలమైనట్లు ఏఈ శరత్ కుమార్ ఆధ్వర్యంలోని సిబ్బంది సమస్యను గుర్తించింది. దీంతో సిబ్బంది ఇద్దరు గురువారం ప్రాణాలకు తెగించి చెరువు నీటిలో ఈదుకుంటూ వెళ్లి స్తంభం వద్దకు చేరుకున్నారు. కరెంట్ స్తంభం పైకి ఎక్కి మరమ్మతుకు గురైన ఇన్సులేటర్‌ను తొలగించి దాని స్థానంలో కొత్తది అమర్చి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. సిబ్బంది సాహసాన్ని అధికారులు, స్థానికులు ప్రశంసించారు.

అమెరికాలో రోడ్డు ప్రమాదం.. భారతీయుడి అరెస్ట్

న్యూఢిల్లీ, అక్టోబర్ 23:అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదం కేసులో నిందితుడిగా ఉన్న భారతీయుడు అరెస్టయ్యాడు. కాలిఫోర్నియాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురి మృతికి అతడు కారణమయ్యాడని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అక్రమంగా అగ్రరాజ్యంలోకి ప్రవేశించిన అతడి పేరు జషన్‌ప్రీత్ సింగ్ అని స్థానిక మీడియా కథనాలు చెబుతున్నాయి. 21 ఏళ్ల జషన్ సింగ్ ప్రమాద సమయంలో మాదకద్రవ్యాల మత్తులో జోగుతున్నాడని మీడియా కథనాలు పేర్కొన్నాయి.

జషన్ సింగ్ 2022లో అమెరికాలోకి ప్రవేశించాడు. అప్పుడు కాలిఫోర్నియాలోని బోర్డర్ పెట్రోల్ ఏజెంట్లు అతడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణ పెండింగ్‌లో ఉండటంతో అతడిని విడుదల చేశారు. అతడి వద్ద చట్టబద్ధమైన ప్రతాలు లేవని యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ తాజాగా ధ్రువీకరించింది. కాలిఫోర్నియా ప్రమాదంలో ముగ్గురు మృతిచెందగా.. పలువురు గాయపడ్డారు. సింగ్‌కు కూడా గాయాలయ్యాయి.ట్రక్ నడుపుతున్న సమయంలో అతడు డ్రగ్స్ మత్తులో ఉన్నాడని వైద్యులు నిర్ధారించారు. అతడు ట్రాఫిక్‌లో కూడా బ్రేక్స్ వేయలేదని ట్రక్ డ్యాష్‌క్యామ్ రికార్డింగ్‌ను బట్టి తెలుస్తోందని హైవే పెట్రోలింగ్ అధికారి వెల్లడించారు.

తల్లిదండ్రుల మృతితో అనాథలుగా పిల్లలు

నల్గొండ, అక్టోబర్ 23: నాలుగు సంవత్సరాల క్రితం తల్లి, నేడు తండ్రి మరణించడంతో ఇద్దరు పిల్లలు అనాథలుగా మారారు. ఈ విషాదకర సంఘటన తుంగతుర్తి మండల పరిధిలోని వెంపటి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. వెంపటి గ్రామానికి చెందిన బొజ్జ మహేశ్ (30), లావణ్య (24) ద

ఎస్‌జిఎఫ్ రాష్ట్రస్థాయి బాస్కెట్బాల్ పోటీలకు ఎంపికైన అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థులు

కరీంనగర్, అక్టోబర్ 23: (నేటినిజం ప్రతినిధి) స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ- టెక్నో పాఠశాలకు చెందినటువంటి విద్యార్థులు ఎస్ జిఫ్ రాష్ట్రస్థాయి అండర్- 14, అండర్ 17 బాలబాలికల బాస్కెట్ బాల్ పోటీలకుఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసినటువంటి ప్రత్యేక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అల్ఫోర్స్ సంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి హాజరై వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల ద్వారా విద్యార్థులకు ఎన్నో రకాలుగా లాభాలు చేకూర్తాయని ముఖ్యంగా వారికిఎదురవుతున్నటువంటి ఒత్తిడి నుండి ఉపశమనం పొందవచ్చని అభిప్రాయపడ్డారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులకు క్రీడలు చాలా అవసరమని, క్రీడల ద్వారా విద్యార్థులు ఖ్యాతి గడిస్తారని అభిప్రాయం చెప్పారు. క్రీడల యొక్క ప్రాముఖ్యతను దృష్టిలో పెట్టుకొని పాఠశాలలో విద్యార్థులకు అత్యుత్తమ వ్యాయామ ఉపాధ్యాయులచే శిక్షణ ఇప్పిస్తూ వివిధ స్థాయిలలో నిర్వహింపబడేటువంటి పోటీలకు ప్రాథమికంగా పాఠశాలలో అర్హత పరీక్ష నిర్వహించి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందని వారు చెప్పారు. ఈ క్రమంలో ఇటీవల కాలంలో కరీంనగర్ లో నిర్వహించినటువంటి జోనల్ స్థాయి అండర్ 17 విభాగంలో పాఠశాలకు చెందినటువంటి బి సిద్ధార్థ, బీ.రణధీర్, టీ.ముగ్ధ ఎస్. జస్లిన్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనారని తెలిపారు×. అదేవిధంగా జగిత్యాలలో నిర్వహించినటువంటి జోనల్ స్థాయి పోటీలలో అండర్ 14 విభాగంలో×సిహెచ్.రియాన్స్, టి.సాయి అక్షిత్, పి.సహస్ర,×బి.మృనాలి, విధాత్రి, జి. సంకృతి ఎంపికైనారని హర్షం వ్యక్తం చేస్తూ విజేతలందరికీ పుష్పగుచ్చాలను అందజేసి రాష్ట్రస్థాయిలోనూ అత్యుత్తమ విజయాన్ని సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా బైక్ ర్యాలీ

వరంగల్, అక్టోబర్ 23: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఈ రోజు నగరంలోని మామునూర్ నాలుగో బెటాలియన్ అధికారులు, సిబ్బంది బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ బైక్ ర్యాలీకి నాలుగో బెటాలియన్ కమాండెంట్ డి శివ ప్రసాద్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.

ఈ ర్యాలీ మొదటగా బెటాలియన్ మొదటి గేటు నుండి ప్రారంభమై మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ వరకు తిరిగి మామునూర్ మీదుగా వాగ్దేవి ఇంజనీరింగ్ కాలేజ్ జంక్షన్ నుంచి తిరిగి మామునూరు క్యాంపు వరకు సాగింది. ఈ బైక్ ర్యాలీలో భాగంగా ట్రాఫిక్ నిబంధనలు తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా కమాండెంట్ డి శివ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ బైక్ లపై వెళ్లే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రయాణించాలని, రోడ్డు ప్రమాదాల నుండి రక్షణ పొందాలని తెలియజేశారు.

రోడ్డుప్రమాదాలలో మరణించిన వారిలో హెల్మెట్ ధరించని వారే ఎక్కువగా ఉన్నారని కావున ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి వారి గమ్యస్థానాలకు సురక్షితంగా వెళ్లాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్స్ పి శ్రీనివాసరావు, వీరన్న, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు విజయ్, కార్తీక్, రవి, వెంకటేశ్వర్లు, రాజ్ కుమార్, కృష్ణ, రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్స్, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం - సీపీ గౌష్ ఆలం

కరీంనగర్, అక్టోబర్ 23: (నేటినిజం ప్రతినిధి) పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకొని గురువారం నాడు పోలీసు పరేడ్ గ్రౌండ్ నందు విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించినట్లు కరీంనగర్ పోలీసు కమిషనర్ సీపీ గౌష్ ఆలం తెలిపారు. నగరంలోని పలు పాఠశాలల విద్యార్థులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ ఓపెన్ హౌస్ ద్వారా విద్యార్థులకు పోలీసు వ్యవస్థ పనితీరు, విధి నిర్వహణలో ఉపయోగించే వివిధ పరికరాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా, డాగ్ స్క్వాడ్ (పోలీసు జాగిలాలు), ఆయుధాలు, అన్ని రకాల తుపాకులు, అల్లర్ల నియంత్రణకు వినియోగించే స్మోక్ గన్, షెల్స్, బాంబు నిర్వీర్య విభాగం యొక్క పని విధానాన్ని వివరించారు. అలాగే, డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్లు, పోలీసులు వినియోగించే కమాండ్ కంట్రోల్ వాహనం, అల్లరిమూకలను చెదరగొట్టేందుకు వినియోగించే స్మోక్ షెల్స్ ను పేల్చేందుకు వీలుగా వుండే వజ్ర వాహనంతో పాటు ప్రదర్శనలో ఉంచారు. షీ టీం, సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్, యాంటీ నార్కోటిక్ సెల్, ట్రాఫిక్ విభాగానికి సంబంధించిన స్టాల్స్‌ను ఏర్పాటు చేసి, విద్యార్థులకు వాటి గురించి పూర్తి వివరాలు అందించారు. సైబర్ నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నేరం జరిగినట్లయితే వెంటనే ఫిర్యాదు చేసే విధానాలు తెలిపే స్టాలను విద్యార్థులు ఆసక్తిగా సందర్శించారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాలలో ప్రజలను భాగస్వామ్యం చేసే ఉద్దేశ్యంతో అక్టోబర్ 31వ తేదీ వరకు పలు కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పోలీస్ కమిషనర్ శ్రీ గౌష్ ఆలం తెలిపారు. ఈ వారోత్సవాలను విజయవంతం చేయడానికి ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు ఈ పోటీలలో మరియు కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొనాలని ఆయన కోరారు.

శాంతిభద్రతలను సంరక్షించడంలో పోలీస్ పాత్ర కీలకం

- అల్ఫోర్స్ అధినేత డాక్టర్ వి నరేందర్ రెడ్డి- పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో అల్ఫోర్స్ విద్యార్థులకు ఓపెన్ హౌస్

కరీంనగర్, అక్టోబర్ 23: (నేటినిజం ప్రతినిధి) సమాజ అభివృద్ధిలో పోలీసు పాత్ర చాలా ఆదర్శనీయమైనదని, శాంతిభద్రతలను సంరక్షించడంలో వారి పాత్ర స్ఫూర్తిదాయకమని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి అన్నారు. పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో నిర్వహించిన ఓపెన్ హౌస్ లో స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్ నెక్స్ట్ విద్యార్థులు గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆల్ఫోర్స్ అధినేత డాక్టర్ వి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో పోలీసుల యొక్క విశిష్టతను, సార్థకతను తెలియపరచడానికి ప్రత్యేక కార్యక్రమాలను రూపొందిస్తున్న కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ను అభినందించారు. పోలీసుల పాత్ర చాలా విశిష్టమైనదని, వారు తీసుకున్నటువంటి చొరవతో సమాజంలో ప్రతి ఒక్కరూ వారి యొక్క కార్యకలాపాలను సజావుగా శాంతియుత వాతావరణంలో కొనసాగిస్తున్నారని తెలిపారు. వారి యొక్క విధులు విధానాలు చాలా సంక్లిష్టమైనవని, అన్ని సందర్భాలలో సహాయపడేది వారేనని చాటి చెప్పారు. ముఖ్యంగా శాంతిని పరిరక్షించడంలో, చెడు అలవాట్లకు అడ్డుకట్ట వేయడంలో, యువతను ప్రేరేపించడంలో చాలా కీలకంగా వ్యవహరిస్తూ అభివృద్ధికి బాటలు వేస్తున్నారని సేవలను కొనియాడారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకొని ఏర్పాటు చేసినటువంటి ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొనడం బాధ్య తయుతంగా, స్ఫూర్తిదాయకంగా భావిస్తున్నామని చెప్పారు. చాలా చక్కటి కార్యక్రమాలతో ప్రజల్లో అవగాహన పెంపొందిస్తు, జాగ్రూతపరుస్తున్న నగర పోలీస్ కమిషనర్ కి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

అదనపు కలెక్టర్ గా గరిమా అగ్రవాల్ బాధ్యతలు-సెలవులో వెళ్లిన కలెక్టర్ ఎం హరిత

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 23: (నేటినిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గా గరిమా అగ్రవాల్ గురు వారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయానికి అదనపు కలెక్టర్ చేరుకోగా, అదనపు కలెక్టర్ రెవెన్యూ గడ్డం నగేష్ పుష్ప గుచ్చం అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తన ఛాంబర్లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గా గరిమా అగ్రవాల్ బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్ ఎం హరిత సెలవుపై వెళ్లగా, ఇంచార్జి కలెక్టర్ గా సైతం గరిమా అగ్రవాల్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు జిల్లా అధికారులు కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో ఏవో రామ్ రెడ్డి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రౌడీయిజం, గుండాయిజాన్ని నియంత్రించండి

వరంగల్, అక్టోబర్ 23: వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ బుధవారం వెస్ట్‌జోన్ పరిధిలోని ఘనపూర్ పోలీస్ స్టేషన్ పాటు ఏసీపీ కార్యాలయమును సందర్శించారు. వరంగల్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారిగా వెస్ట్‌జోన్ పరిధిలోని పోలీస్ స్టేషన్లను సందర్శించిన పోలీస్ కమిషనర్ ముందుగా పోలీస్ స్టేషన్ పరిసరాలు, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు.

అనంతరం స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది వివరాలను సిపి సంబంధిత స్టేషన్ ఇన్స్పెక్టర్‌ను అడిగి తెలుసుకొవడంతో పాటు, స్టేషన్ పరిధిలో అత్యధికంగా ఎలాంటి నేరాలు నమోదవుతాయి. స్టేషన్ పరిధిలో ఎన్నిసెక్టార్లు వున్నాయి, సెక్టార్‌వారిగా ఎస్.ఐలు నిర్వహిస్తున్న విధులు, వారి పరిధిలోని రౌడీ షీటర్లు, అనుమానితులు వారి ప్రస్తుత స్థితి గతులను సంబంధిత సెక్టార్ ఎస్.ఐని అడిగి తెలుసుకోవడంతో పాటు స్టేషన్‌వారిగా బ్లూకోల్ట్స్ సిబ్బంది పనితీరుతో పాటు, వారు విధులు నిర్వహించే సమయాలను పోలీస్ కమిషనర్ స్టేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

అనంతరం పోలీస్ కమిషనర్ స్టేషన్ అధికారులకు పలుసూచనలు చేస్తూ ప్రతి స్టేషన్ అధికారి తప్పనిసరిగా రౌడీ ఇండ్లను సందర్శించి వారి స్థితిగతులపై ప్రత్యక్షంగా ఆరా తీయాలని, ఆర్థిక సైబర్ నేరాలకు సంబంధించి కేవలం కేసు నమోదు చేయడమే తమ బాధ్యతనే కాకుండా సైబర్ నేరాలకు సంబంధించి నేరానికి పాల్పడిన నేరస్థుల మూలాల కూడా దర్యాప్తు అధికారులు కనిపెట్టి నిందితులను అరెస్టు చేయాలని.

గంజాయితో పాటు ఇతర మత్తు పదార్థాలకు సంబంధించి క్రయ విక్రయాలపై స్టేషన్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి మత్తు పదార్థాల నియంత్రణకై నిరంతరం పనిచేయాలని. నేరాల నియంత్రణకై విజుబుల్ పోలీసింగ్ అవసరమని, ఇందుకొసం నగరంలో నిరంతం పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించాలని పోలీస్ కమిషనర్ స్టేషన్ అధికారులకు సూచించారు. పోలీస్ కమిషనర్ వెంట వెస్ట్ జోన్ డిసిపి రాజ మహేంద్ర నాయక్, ఏసీపీ భీంశర్మ, ఘన్పూర్ ఇన్స్ స్పెక్టర్ వేణు తో ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల విధుల పట్ల విద్యార్థులు అవగాహన పెంచుకోవాలి.. హుజురాబాద్ ఏసీపీ మాధవి

కరీంనగర్, అక్టోబర్ 23:పోలీస్ స్టేషన్లోని పలు అంశాలు, విధుల పట్ల విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని హుజురాబాద్ ఏసీపీ మాధవి అన్నారు. పోలీసు అమరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్లో ఎస్ఐ ఆవుల తిరుపతి ఆధ్వర్యంలో కేరళ ఇంగ్లీష్ మీడియం విద్యార్థులకు పలు అంశాలపై గురువారం అవగాహన కల్పించారు.

క్రైం సీన్, బ్లూకోట్ వినియోగం, గంజాయి, మద్యం సేవించిన వారిని గుర్తించడం, వేలిముద్రల ద్వారా నేరస్థుల గుర్తింపు, డయల్ 100 వినియోగం, పలు అంశాలపై విద్యార్థులకు ప్రత్యక్షంగా అవగాహన కల్పించారు. బాలికలకు గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థులు పోలీస్ వ్యవస్థ, వారి విధుల గురించి అవగాహన కలిగి ఉండాలనే ఓపెన్ హౌజ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే రౌడీషీ టర్లను పిలిచి నేరాలకు దూరంగా ఉండాలని కౌన్సిలింగ్ చేసినట్లు ఈ సందర్భంగా ఏసీపీ మాధవి అన్నారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట రూరల్ సీఐ లక్ష్మీనారాయణ, ఏఎస్ ఐ వెంకట్ రెడ్డి, పోలీసు సిబ్బంది, కేరళ ఇంగ్లీష్ మీడియం హెచ్ఎం మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు మంత్రి డోలా హెచ్చరిక

అమరావతి, అక్టోబర్ 23: జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపద్యంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి జిల్లా మంత్రి డోల బాల వీరాంజనేయ స్వామి ప్రత్యేక అధికారులతో బుధవారం స్థానిక కలెక్టరేట్ లో సమీక్షించారు. ప్రధానంగా మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లకుండా చర్యలు చేపట్టాలని మంత్రి అధికారులు ఆదేశించారు. ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని అధికారులు ఆదేశించారు.

ఇప్పటికే వర్ష ప్రభావిత మండలాల్లో పాఠశాలలు అంగన్వాడీ కేంద్రాలకు సెలవులు మంజూరు చేశామని కలెక్టర్ రాజాబాబు మంత్రికి వివరించారు. జిల్లాలోని వాగులు వంకలు వద్ద ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా పోలీస్ రెవిన్యూ అధికారులు గస్తిని ఏర్పాటు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఆయా మండలాల స్పెషలాఫీసర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరచాలి

మహబూబాబాద్, అక్టోబర్ 23:ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలను పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ అండ్ మేజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో తో కలిసి కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశ మందిరంలో విద్యార్థుల సామర్థ్యాలను మెరుగుపరచడానికి, హాజరు శాతాన్ని పెంచడానికి ఎం.ఈ.ఓ లు, కాంప్లెక్స్ హెచ్ఎం లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఈఎఒ) నైపుణ్యాలపై దృష్టి సారించి, ప్రత్యేక పఠన మెరుగుదల ప్రణాళికను అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పదవ తరగతి ఫలితాల్లో ఇంతకు ముందు సంవత్సరంలో పనితీరు కనబరిచిన పాఠశాలలపై దృష్టి పెట్టి ఉత్తమ ఫలితాలు రాబట్టేందుకు విద్యార్థుల యొక్క అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరచాలని, రాబోయే పదవ తరగతి పరీక్షలలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ఉపాధ్యాయులు ఖచ్చితంగా సమయపాలన పాటించాలని అన్నారు. ఎం.ఈ.ఓ లు మండలంలోని ప్రతి పాఠశాలను ఖచ్చితంగా సందర్శించి ప్రధానోపాధ్యాయులతో సమావేశాలు నిర్వహించి, రికార్డు పరంగా అన్ని అంశాలపై చర్చించాలని, విద్యార్థులకు బోధనా పద్ధతులను, సందేహాల నివృత్తి, విద్యార్థుల హాజరు శాతం మెరుగుదల వంటి అంశాలపై సమావేశాలు నిర్వహించి ఖచ్చితంగా అమలు చేయాలని అన్నారు. అందుకు సంబంధించిన నివేదికలను ఎప్పటికప్పుడు తెలియజేయాలని అన్నారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక ఉపాధ్యాయుడితో శిక్షణ ఇప్పించి విద్యార్థి యొక్క సందేహాలను నివృత్తి చేసి ప్రతిభావంతునిగా తీర్చిదిద్దాలని అన్నారు. అంతకు ముందు సంవత్సరం ఉత్తీర్ణతలో వెనుకబడిన పాఠశాలలు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రతి పాఠశాల పై ఎం.ఈ.ఓ లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి దక్షిణామూర్తి, ఎం.ఈ.ఓ లు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం హుండీ ఆదాయం రూ. 4,08,69,958

శ్రీశైలం, అక్టోబర్ 23: శ్రీశైలం దేవస్థానానికి రూ. 4,08,69,958 నగదు రాబడి వచ్చినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. ఈ ఆదాయంలో హుండీల ద్వారా రూ. 3,97,30,582, అన్నప్రసాద వితరణ హుండీల ద్వారా రూ. 11,39, 376లు మొత్తం వెరసి రూ 4,08, 69,958 ఆదాయం సమకూరినట్లు పేర్కొన్నారు. ఈ ఆదాయం గత 35 రోజుల్లో వచ్చిందని తెలిపారు.

ఈ ఏడాది జూన్ 27 నుంచి అక్టోబర్ 22వ తేదీ వరకు అన్నప్రసాద వితరణ హుండీల రాబడిని భక్తులు సమర్పించినట్లు పేర్కొన్నారు. అలాగే ఈ హుండీలో 639 గ్రాముల 500 మిల్లీగ్రాముల బంగారు, 3 కేజీల 480 గ్రాముల వెండి లభించాయి. అదేవిధంగా 363- యుఎస్ఏ డాలర్లు, 30 ? యు.ఏ.ఈ దిర్హమ్స్ , 1 ? కువైట్ దినార్, 5 ? సౌదిరియాల్స్ , 1- కత్తార్ రియాల్స్, 62- సింగపూర్ డాలర్లు, 40 ? కెనడియన్ డాలర్లు , 20 ? ఇంగ్లాండ్ పౌండ్స్ 27 ? మలేషియా రింగిట్స్ , 200 ? ఓమన్ బైసా, 6,20,000 ? కొరియా ఓన్స్ మొదలైన విదేశీ కరెన్సీ కూడా ఈ హుండీల లెక్కింపులో లభించాయి. పటిష్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య సీసీ కెమెరాల నిఘాతో ఈ లెక్కింపును చేపట్టారు.

ఈ కార్యక్రమములో కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు, పలు విభాగాల యూనిట్ అధికారులు, పర్యవేక్షకులు, సిబ్బంది, శివసేవకులు తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖనంలో కృష్ణవేణి పాఠశాల విద్యార్థుల ప్రతిభ

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 23:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణములోని కృష్ణవేణి పాఠశాల విద్యార్థులు చిత్రలేఖనంలోప్రతిభ కనబరిచారు. ఇటీవల ఈనాడు ప్రతిభ పాటవ పోటీలలో చిత్రలేఖనము అంశంలో కే అక్షర (9వ తరగతి) మొదటి బహుమతి, కట్టా సహజ (7వ తరగతి) రెండవ బహుమతి, పేరాల లాస్యశ్రీ (8వ తరగతి) మూడవ బహుమతినీ గెలుపొందారు. ఈ పోటీలలో గెలుపొందిన విద్యార్థులను పాఠశాలల డైరెక్టర్ సన్నిధి వెంకట కృష్ణ, కృష్ణవేణి పాఠశాలల జోనల్ మేనేజర్ సంపత్ రావులు అభినందించారు. డైరెక్టర్ సన్నిధి వెంకటకృష్ణ మాట్లాడుతూ పిల్లలు భవిష్యత్తులో ఇంకా ఎన్నో బహుమతులను గెలవాలని ఆకాంక్షించారు. ఈ పోటీలను పాఠశాలలో నిర్వహించడంపై స్కూల్ ప్రిన్సిపల్స్, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.



జిగ్మా గ్లోబల్ ఎన్విరాన్ సొల్యూషన్స్ సంస్థకు 2025 స్వచ్ఛ్ ఆంధ్ర అవార్డు

హైదరాబాద్, అక్టోబర్ 23:బ్లూ ప్లానెట్ ఎన్విరాన్‌మెంటల్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కి చెందిన జిగ్మా గ్లోబల్ ఎన్విరాన్ సొల్యూషన్స్ సంస్థ, రాష్ట్రంలో లెగసీ వ్యర్థాల శుద్ధి పనుల్లో చేసిన అద్భుత సేవల కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్వచ్ఛ్ ఆంధ్ర అవార్డు 2025తో సత్కరించింది. ఈ గుర్తింపు, స్వచ్ఛ్ భారత్ మిషన్ ? అర్బన్ 2.0 పరిధిలో ?123.60 కోట్ల విలువైన క్లస్టర్ ఆధారిత పునరుద్ధరణ ప్రాజెక్టులను సమర్థవంతంగా అమలు చేసిన జిగ్మా సంస్థ యొక్క విశిష్ట పనితీరును ప్రతిబింబిస్తుంది. రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో అమలు చేసిన ఈ ప్రాజెక్టులు, శాస్త్రీయ బయోరిమిడియేషన్, బయోమైనింగ్, భూమి పునరుద్ధరణపై దృష్టి సారించి, దశాబ్దాల నాటి వ్యర్థాల నిల్వ స్థలాలను పునరుద్ధరించిన భూమిగా మార్చి, రాష్ట్రవ్యాప్తంగా పర్యావరణ పునరుజ్జీవనానికి దోహదపడ్డాయి. ఈ ప్రతిష్టాత్మక పురస్కారం విజయవాడలో జరిగిన ఘన కార్యక్రమంలో, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేత ప్రదానం చేయబడింది. ఈ కార్యక్రమంలో మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ , స్వచ్ఛ్ ఆంధ్ర కార్పొరేషన్ యం ఎ యుడి శాఖకు చెందిన ఉన్నతాధికారులు హాజరయ్యారు. ప్రాజెక్ట్ అమలు లో అత్యుత్తమత జిగ్మా సాధించిన ఈ విజయము, సంస్థ యొక్క అసాధారణ ప్రాజెక్ట్ అమలు సామర్థ్యాలను ప్రతిబింబిస్తుంది. సంస్థ మార్చి 2025లో తన బిడ్‌ను సమర్పించి, ఏప్రిల్ 2025లో అధికారిక ఒప్పందాలను కుదుర్చుకుంది. కార్యాచరణలో అద్భుత సమర్థతను ప్రదర్శిస్తూ, జిగ్మా మొత్తం 6 క్లస్టర్లలో పనులను చేపట్టి, 14.5 లక్షల టన్నుల వ్యర్థాలను ప్రాసెస్ చేసి, 50,000 టన్నులకుపైగా ఆర్ డి ఎఫ్ ను దేశంలోని ఐదు సిమెంట్ కర్మాగారాలకు పంపిణీ చేసింది. "స్వచ్ఛ్ ఆంధ్ర అవార్డు 2025 అందుకోవడం మా బృందానికి గర్వకారణమైన మైలురాయిగా నిలిచిందని అన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com